# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త






## తీరంలో అలల ఉధృతి

కోట, అక్టోబర్ 27 ప్రభాతవార్త



బంగాళాఖాతంలో మొంథా తుపాను నేపథ్యంలో కోట మండలంలోని తీరప్రాంతంలో సముద్రం వెంబడి అలల ఉధృతి పెరిగింది. సోమవారం తహశీల్దార్ కె.జయజయరావు గోవిందపల్లి, శ్రీనివాససత్రం తదితర గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. తీరం వెంబడి జల్లులతో కూడిన వర్షం కురుస్తోంది.



తిరుపతిలోని కపిలతీర్థంలో శాస్త్రోక్తంగా దక్షిణామూర్తిస్వామి వారి హోమం

# మండలాల్లోనే స్పెషల్ ఆఫీసర్లు మకాం

**- తుఫాను ప్రభావిత గ్రామాల్లో పునరావాస కేంద్రాలు**

**- ప్రాణ, ఆస్తినష్టం జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు**

**అధికారులతో కలెక్టర్ సుమిత్‌కుమార్, స్పెషల్ ఆఫీసర్ గిరీషా సమీక్ష**



తుఫాను ముందు జాగ్రత్త ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ , స్పెషల్ ఆఫీసర్

చిత్తూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త:

మొంథా తుఫాను ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు నమోదు అయ్యే అవకాశం వుండటంతో తుఫాను ప్రభావం తగ్గే వరకు స్పెషల్ ఆఫీసర్లందరు మండలాల్లోనే మకాం వేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్, మొంథా తుఫానులో కలెక్టర్‌కు సహాయ సహకారాలు అందించడానికి నియమితులైన స్పెషల్ ఆఫీసర్ గిరీషాలు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్, స్పెషల్ ఆఫీసర్ గిరీషాలు తుఫాను ముందస్తు జాగ్రత్తలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, స్పెషల్ ఆఫీసర్ గిరీషాలు మాట్లాడుతూ తుఫాను కారణంలో ఎక్కడా ప్రాణ, ఆస్తినష్టం జరుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే తుఫాను ప్రభావిత గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, తుఫాను షెల్టర్లతో పాటు అవసరమైతే పాఠశాలు, కళాశాలలు, ఇతర ప్రభుత్వ భవనాలను పునరావాస కేంద్రాలుగా వినియోగించుకోవాలన్నారు. తుఫాను ప్రభావిత గ్రామాల ప్రజలతో పాటు, వర్షాలతో ఇళ్ళు నానిపోయిన వారిని సైతం పునరావాస కేంద్రాలకు తరలించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పునరావాస కేంద్రాలకు తరలించే ప్రజల కోసం మూడు రోజులకు సరిపడ నిత్యవసర వస్తువులు ముందుగా సేకరించి సిద్ధం చేసుకోవాలని, అక్కడే ఆహారం వండి అందించాలని, మరిగే నీటిని ప్రజలకు అందించాలని, చిన్న పిల్లలకు పాలను అందించాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసిన పాఠశాలల్లో సిబ్బంది విధులకు హాజరై పునరావాస విధుల్లో పాల్గొనాలన్నారు. అలాగే 108, 104, 102 వాహనాల వివరాలు, వైద్య సిబ్బంది మొబైల్ నెంబర్ల వివరాలను కంట్రోల్ రూమ్‌లో సిద్ధంగా వుంచుకోవాలని ఆదేశించారు. హైరిస్క్ గర్భిణీలను ముందస్తుగానే ఆసుపత్రుల్లో చేర్చాలని, గర్భిణీల సహాయకులకు సైతం వసతిని ఏర్పాటు చేయాలన్నారు. మంచినీరు కలుషితం కాకుండా పైపులను తనిఖీ చేయాలని, క్లోరినేషన్ చేసిన నీటినే ప్రజలకు అందించాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం మెరుగుకు అవసరమైన సిబ్బందిని సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఇరిగేషన్ ఎస్ఇ రాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ప్రసన్నకుమార్, ‌ఋన్సిపల్ కమీషనర్ పాల్గొన్నారు.

## ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా పక్కా చర్యలు : కలెక్టర్



జిల్లాలో మొంథా తుఫాను ప్రభావంతో ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరుగకుండా అప్రమత్తంగా వుండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికార యంత్రాంగంను ఆదేశించారు. జిల్లాలో మొంథా తుఫాను ప్రభావం వల్ల మంగళ, బుధవారాల్లో భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం వుండటంతో వాతావరణశాఖ రెడ్ అలర్ట్ ప్రకటించిందన్నారు. మొంథా తుఫాను ప్రభావంతో కురిసే వర్షాలతో భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వ అధికారులు సూచించిన వెంటనే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్ళాలన్నారు. ఎవరికైనా ఇల్లు సురక్షితంగా లేకుంటే సురక్షిత ప్రాంతాలకు వెళ్ళి తుఫాను సమయంలో వుండాలన్నారు. జిల్లాలో మొంథా తుఫాను పరిస్థితులను సమర్ధవంతంగా ఎదుర్కొవడానికి కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌తో పాటు చిత్తూరు, పలమనేరు, నగరి, కుప్పం ఆర్డీఓ కార్యాలయాల్లో 24 గంటలు విధులు నిర్వర్తించేలా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మొంథా తుఫాను ప్రభావంతో ఎవరికైనా ఇబ్బందులు తలెత్తితే కింది నెంబర్లకు సమాచారం అందిస్తే సత్వర సహాయం అందిస్తారన్నారు.

*కలెక్టర్ కార్యాలయం కంట్రోల్ రూమ్ ఫోన్: **08572-242777***

*ఆర్డీఓ కార్యాలయం, చిత్తూరు: **63029 05772***

*ఆర్డీఓ కార్యాలయం, పలమనేరు: **94910 74510***

*ఆర్డీఓ కార్యాలయం, నగరి: **94918 03680***

*ఆర్డీఓ కార్యాలయం, కుప్పం: **94910 74513, 63030 24467***

## నేడు పాఠశాలలకు సెలవు

మెంథా తుఫాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు నమోదు అయ్యే అవకాశం వుండటంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు మంగళవారం సెలవు ప్రకటించారు. డివైఇఓలు, మండల విద్యాశాఖ అధికారులు, హెడ్మాష్టర్లు కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించాల్సిందిగా జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి ఆదేశించారు. అలాగే మండల విద్యాశాఖ అధికారులు మండల కేంద్రాల్లోని కంట్రోల్ రూమ్‌లో అందుబాటులో వుండాలని డిఇఓ వరలక్ష్మి ఆదేశించారు.

## జోరు వర్షాలకు నీట మునిగిన వరిపంట

**-లక్ష రూపాయలు ఆస్తినష్టం**

ఐరాల, అక్టోబర్ 27 ప్రభాతవార్త :



మండలంలో గత కొద్దిరోజులుగా కురుస్తున్న జోరు వర్షాలకు పుల్లూరు గ్రామానికి చెందిన గణేష్ రెడ్డి అనే రైతుకు చెందిన సుమారు 6 ఎకరాల వరి పంట నీట మునిగడంతో సుమారు లక్ష రూపాయలు నష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు. పుల్లూరుకు చెందిన గణేష్ రెడ్డి అనే రైతు తనకున్న వ్యవసాయ పొలంలో ఆరు ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. ఎన్నో ప్రయాసలకు ఓర్చి సాగుచేసిన వరి పంట ప్రస్తుతం కోతదశకు చేరుకుంది. అయితే నూర్పిడి దిశలో ఉండగా గత కొద్దిరోజులుగా మండలంలో ఎడతెరిపిలేని జోరు వర్షాలు కురుస్తుండడంతో వరి పంట పూర్తిగా నీట మునిగిపోయింది. అలాగే పంట మొలకలు రావడంతో తీవ్ర నష్టం వాటిల్లుతోంది. పంట నీట మునిగిపోవడంతో సుమారు లక్ష రూపాయలు మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు గణేష్ రెడ్డి తెలిపారు. పంట చేతికొచ్చే సమయంలో వర్షాల కారణంగా నీట మునిగిపోవడంతో తమకు ఏమి చేయాలో అర్థం కావడం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకొని నష్టపరిహారం ఇప్పించాలని బాధ్యత రైతు గణేష్ ఎట్టినష్టపరిహారం ఇప్పించాలని బాధ్యత రైతు తెలిపారు.

## పరకామణి కేసు వివాదం

# ఎందరి మెడకు చుట్టుకుంటుందో!?

**-సిఐడి విచారణలో ఏం తేలనుందో!**

తిరుమల, అక్టోబర్ 27ప్రభాతవార్త‌ప్రతినిధి:



వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి భక్తులు సమర్పించే కానుకలు లెక్కించే పరకామణిలో చోరీ కేసు వివాదం ఇప్పుడు సిఐడి చేతికి వెళ్ళడంతో ఏం జరగబోతోందనేది గుబులురేకెత్తిస్తోంది. 2023లో జరిగిన 920 అమెరికన్ డాలర్ల చోరీ కేసు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం, ఆపై లోక్‌అదాలత్‌లో రాజీచేసుకోవడం సంచలనం కలిగించింది. ఈ కేసులో హైకోర్టులో పిటిషన్‌తో న్యాయమూర్తి సోమవారం ఆదేశాలతో సిఐడి రంగంలోకి దిగితే ఇప్పుడు ఎందరికి గుదిబండగా మారనుందనే ఆందోళన కలిగించే విషయం. ఈ వ్యవహారంలో తొలినుండి అటు టిటిడి విజిలెన్స్,గత టిటిడి బోర్డుపెద్దలు, టిటిడి ఉన్నతాధికారి, కొందరు పోలీసు అధికారులు కలసి క్రిమినల్ కేసును లోక్‌అదాలత్‌లో మధ్యవర్తిత్వం జరిపి రాజీ కుదుర్చడం వెనుక పెద్ద తతంగమనే నడిచిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాదాపు వందకోట్ల రూపాయలుపైగానే పరకామణిలోనుండి అమెరికా విదేశీ డాలర్లు చోరీ చేసి అక్రమంగా ఆస్తులు కూడగట్టినట్లు ఆరోపణలు. అయితే అందులో కేవలం 14కోట్ల రూపాయలు విలువైన ఆస్తులను నేరస్తుడి నుండి వేంకటేశ్వరస్వామికివిరాళంగా అందించామని బోర్డులో తీర్మానం చేయడం వంటివి ఇప్పుడు హైకోర్టు ముందు కీలకంగా మారాయి. ఈ బాగోతంపై తాజాగా హైకోర్టు న్యాయమూర్తి సిఐడి, ఏసిబి విభాగాలతో విచారణ చేయాలని ఆదేశించడంతో అందరిలోనూ అంతర్మధనం మొదలైంది. సాధారణంగా దేవుని సొమ్మును కాజేసిన వాడెవడైనా చట్టప్రకారం శిక్షించాల్సిన బాధ్యత పోలీసుశాఖపై ఉంది. అయితే 2023లో తిరుమలలో విజిలెన్స్ విభాగం కూడా అప్పటి చోరీ కేసు సిసిపుటేజీలు మాయం చేశారనేది సిఐడి ఎంతవరకు కూపీ లాగనుందనేది ఇప్పుడు కీలకంగా మారింది. సిఐడి దర్యాప్తులో ఎవరెవరినీ విచారణ చేయనున్నారు?ఎందరి హస్తం ఉందనేది ?ఒక్కొక్కరు ఏ మేరకు నిందితుడు రవికుమార్ నుండి లాభపడ్డారనేది కూడా వెలుగుచూడనుంది.. పరకామణి కుంభకోణంపై తొలినుండి వివాదమే రగులుతున్నా గత వైసిపి ప్రభుత్వంలో, టిటిడి బోర్డులో పెద్దల అండతో ఏమీ పట్టించుకోలేదనేది ప్రధాన ఆరోపణలు. దేవుని సొమ్ము కాజేసిన రవికుమార్‌కు వత్తాసు పలికిన టిటిడి వర్గాలు, పోలీసు అధికారులపై వేటు తప్పదా? డిసెంబర్ 2వతేదీ వరకు ఉత్కంఠే.

## సూళ్లూరుపేటలో కార్తీక సోమవారం పూజలు



సూళ్లూరుపేట, అక్టోబర్ 27 ప్రభాతవార్త

సూళ్లూరుపేట పట్టణంలో కార్తీక మాసం ప్రథమ సోమవారాన్ని పురస్కరించుకుని శివాలయాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు శివాలయాకు తరలి వెళ్లి దీపాలు వెలిగించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని శ్రీనాగేశ్వరస్వామి దేవస్థానం అభయశంకర ఆలయంలోను ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం, అభిషేకా లు జరిగాయి. భారీ అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. నాగేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మన్ తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, ప్రధాన అర్చకులు పేటేటి సునీల్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. అభయ శంకర ఆలయంలో అర్చకులు రమణయ్య, ఎఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్ పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించారు.

## మరో రెండు రోజుల పాటు టెన్షన్

**మళ్ళీ 30వ తేదీకి శిక్ష నిర్ధారణ వాయిదా**

చిత్తూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త:

చిత్తూరు మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్‌ల హత్య కేసులో నిందితుల శిక్ష మరోసారి వాయిదా పడింది. చిత్తూరు 6వ అదనపు జడ్జి కోర్టు మేయర్ దంపతుల హత్య కేసులో నిందితులుగా ఖరారైన ఐదు మందికి సోమవారం శిక్ష ఖరారు చేస్తామని ప్రకటించడంతో చిత్తూరు నగర ప్రజల్లో ఈ కేసు తీర్పుపై ఉత్కంఠత నెలకొంది. అయితే ఈ కేసులో నిందితులుగా ఖరారైన ఐదు మందిని పోలీసులు సోమవారం కోర్టు ఎదుట హాజరుపరచగా జడ్జి శ్రీనివాసరావు నిందితులను విచారించి ఈ కేసు తీర్పును ఈ నెల 30వ తేదీకి వాయిదా వేశారు. మేయర్ దంపతుల హత్య కేసు శిక్ష మరోసారి వాయిదా పడటంతో చిత్తూరు నగర ప్రజల్లో మరో రెండు రోజుల పాటు టెన్షన్ కొనసాగనుంది. ఈ కేసులో నిందితులుగా నిర్ధారణ అయిన చంద్రశేఖర్ అలియాస్ చింటూ, వెంకటాచలపతి, జయప్రకాష్‌రెడ్డి, మంజునాథ్, వెంకటేష్‌లను పోలీసులు సోమవారం జడ్జి శ్రీనివాసరావు ఎదుట హాజరుపరిచారు. ఈ కేసులోని నిందితులను విచారించిన జడ్జి శిక్ష ఖరారును ఈ నెల 30వ తేదీకి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసులో తుది తీర్పు వెలువరించనున్న జడ్జి శ్రీనివాసరావు ఇంటి వద్ద సైతం పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. చిత్తూరు నగరంలో ర్యాలీలు, ధర్నాలు, ప్రజా కార్యక్ర మాలకు పోలీసులు అనుమతులను రద్దు చేశారు. కోర్టు పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్ళింపులతో పాటు సోషల్ మీడియాలో ఇరు వర్గాలను రెచ్చగొట్టే వాఖ్యలు, విబేధాలు ప్రోత్సహించకుండా వుండేలా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులు సోమవారం ఐదు మంది నిందితులను జడ్జి ఎదుట హాజరు పరిస్తే నిందితులు జడ్జి ఎదుట మరోసారి తమ ఆవేదనను చెప్పుకున్నారు. నిందితుల ఆవేదనను నమోదు చేసుకున్న కోర్టు ఈ నెల 30వ తేదీకి కేసును వాయిదా వేయడంతో పాటు ఆ రోజు నాటికి నిందితుల సామాజిక పరిస్థితి, నిందితుల వైద్య నివేదికలు, జైలులో నిందితుల ప్రవర్తనపై నివేదికలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. మేయర్ దంపతుల హత్య కేసు శిక్ష తీర్పు మరో మారు వాయిదా పడటంతో ఈ తీర్పుపై ఉత్కంఠతతో ఎదురు చూస్తున్న చిత్తూరు ప్రజానీకానికి మరో రెండు రోజుల పాటు నిరీక్షణ తప్పని పరిస్థితి నెలకొంది.

# మరోసారి బిసీలకే 'దేశం' అధ్యక్ష కిరీటం

**- సిఆర్ రాజన్, షణ్ముగరెడ్డిల్లో ఒకరికి ఛాన్స్**





చిత్తూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త:

జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష కిరీటం మరోసారి బిసీ సామాజిక వర్గాలకు దక్కనుంది. జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవి కోసం 17 మంది నాయకులు పోటీ పడినప్పటికీ తెలుగుదేశం పార్టీ అధిష్టానం చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవిని బిసీలకు కట్టబెట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రస్తుతం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా వున్న సిఆర్ రాజన్ మరోసారి అధ్యక్షుడిగా నియమితులయ్యే అవకాశం ఎక్కువగా కన్పిస్తోంది. సిఆర్ రాజన్ ప్రస్తుతం రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా వున్నారు. సిఆర్ రాజన్‌కు రాష్ట్ర స్థాయి వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా వుండటంతో ఒక వ్యక్తికి ఒకే పదవి సూత్రంను అమలు చేస్తే ఈ ఛాన్స్ నగరికి చెందిన మరో తెలుగుదేశం బిసీ నాయకుడు షణ్ముగ రెడ్డికి అవకాశం కన్పిస్తోంది. ఈయన సైతం జిల్లా తెలుగుదేశం అధ్యక్ష పదవి కోసం పోటీ పడ్డారు. షణ్ముగరెడ్డి ప్రస్తుతం జిల్లా తెలుగుదేశం పార్టీ బిసీ సెల్ అధ్యక్షుడిగా, రాష్ట్ర వన్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా, నగరి నియోజక వర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జీగా కొనసాగుతున్నారు. ఈ మేరకు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవి కోసం వీరిద్దరి పేర్లను ఐవిఆర్ఎస్ ద్వారా అభిప్రాయ సేకరణ చేయడంతో ఈ ఇద్దరిలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవి ఎవరికి వరిస్తుందో వేచి చూడాల్సి వుంది.

## శ్రీతిరుపతి గంగమ్మకు 27కిలోల వెండి నాగపడిగలు



కుప్పం, అక్టోబర్ 27ప్రభాతవార్త

జిల్లాలో ప్రసిద్ధి చెందిన కుప్పం శ్రీ తిరుపతి గ ంగమ్మ అమ్మవారికి 27కిలోల వెండితో తొమ్మిది తలల నాగపడిగలు కొత్తగా తయారుచేయాలని దైవ సంకల్పం జరిగినట్లు ఆలయ ఛైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు పేర్కొన్నారు. ఈకార్యక్రమంకు ఇప్పటికే దాతలుముందుకు వచ్చి తమ వద్దగల పాత వెండిని అమ్మవారికి సమర్పిస్తున్నారన్నారు. భక్తులు ఇంకనూ ఎవరైనా అమ్మవారికి వెండి ఇవ్వదలచుకుంటే ఆలయంలో సంప్రదించాలని కోరారు. వచ్చే జనవరి కల్లా అమ్మవారికి నాలుగు అడుగుల వెడల్పుతో వెండి నాగపడిగలు తయారుచేయడం జరుగుతుందన్నారు. ఇందుకు సహకరిస్తున్న భక్తులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# శివరాత్రిని మరపించిన శ్రీకాళహస్తీశ్వరాలయం



శ్రీకాళహస్తి, అక్టోబర్ 27 ప్రభాతవార్త

కార్తీక మాసం మొదటి సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయం శివరాత్రిని మరపించింది.ఉదయం నుంచి వర్షం కురుస్తున్నా ఖాతరు చేయక భక్తులు కదలి తరంగాల్లా కదలి వచ్చారు. ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. ఎవ్వరికి ఇబ్బంది లేకుండా లఘుదర్శనంతో ఇఒ డి.బాపిరెడ్డి సుదర్శనం ఏర్పాటు చేసారు.కార్తిక మాసంలో శివదర్శనం శ్రేష్టమని చెబుతారు.అయితే దక్షిణ భారత దేశంలోని శైవ క్షేత్రాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నాడు. అయితే భక్తిభావంతో పంచభూత లింగాల్లో ఒకటైన వాయులింగేశ్వరుని దర్శనానికి వచ్చిన భక్తులకు సరైన సమాచారం లేక తిప్పలు తప్పలేదు. ఇక దళారీ వ్యవస్థపై ఎన్ని చర్యలు తీసుకుంటున్నా కట్టడి కావటం లేదు.ఈ నేపధ్యంలో కార్తిక మాసం మొదటి సోమవారం భక్తులు తండోపతండాలుగా కదలి వచ్చారు. ఆదివారం రాత్రి 9గంటలకే పట్టణంలోని లాడ్జిలన్ని ఫుల్ అయ్యాయి. తరువాత తమిళనాడు,కర్నాటకల నుంచి వచ్చిన భక్తుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.పసిబిడ్డలు, వయోవృద్ధులతో వచ్చిన కుటుంబాలు కనీసం కునుకు తీయలేక తల్లడిల్లిపోయారు.భక్తులు శివయ్య దర్శనానికి వేకువ జామున 4గంటలకు వెళ్ళే వరకు టీ దుకాణం వద్ద తలదాచుకున్నారు.

**సమాచార లోపం:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా అతిధి గృహాలు నెహ్రూవీధి, జయరారామావువీధి, టూరిస్టు బస్టాండు లోబావిలో 125 గదుల కైలాససదన్, టిటిడి అతిధి గృహాలున్నాయి. అయితే వచ్చిన భక్తులకు సమాచారం ఇవ్వటంలో దేవస్థానం విఫల మౌతుంది. ఇక ఇక్కడకు వచ్చిన భక్తులు మొదట ఆటోల డ్రైవర్ల మాట నమ్ముతున్నారు. దాంతో వారు ఇదే అదను అనుకొని వారి కాంటాక్టులో ఉన్న లాడ్జిలకు తరలిస్తూ నిలువుదోపిడి చేస్తున్నారు. డిమాండ్‌ను బట్టి లాడ్జిలో పని చేసే మేనేజర్లు రేట్లు ఖరారు చేసి దోచుకుంటున్నారు. అయితే భక్తి భావంతోవచ్చిన వారు ఇక్కడి లాడ్జిల దోపిడికి సంబంధించి దేవస్థానం అదికారులకు తెలియనిది కాదు. రైల్వేస్టేషన్, కృష్ణారెడ్డి మండపం బిక్షాల గాలిగోపురం వద్ద సమాచార కేంద్రాలు ఏర్పాటు ఉన్నాయి కానీ అవి దిష్టిబొమ్మల్లా ఉన్నాయి.

**కార్తీక మాసం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రదోష నంది సేవ**



## నారద పుష్కరిణిలో దీపోత్సవం



శ్రీకాళహస్తి, అక్టోబర్ 27 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయం సారథ్యంలో కార్తీక మాసం మొదటి సోమవారం దీపాలకాంతితో దేదీప్యమానంగా తీర్చిదిద్దారు.ఆలయ గోపురాలనే కాకుండా ఆలయంలోపల చేపట్టిన విద్యుత్ దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంది. దేవస్థానం తరఫున మొదటి సోమవారం పట్టణ నడిబొడ్డులోని నారద పుష్కరిణిలో దీపోత్స వం ను ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా కోనేరు ముందు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు.ఆలయ పౌరోహితులు అర్ధగిరి స్వామి వేదమంత్రాలను పఠిస్తుండగా ఆలయ ఉప ప్రధానార్చకులు దక్షిణామూర్తి పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్ పర్యవేక్షించారు. డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి దంపతులు పట్టణానికి చెందిన పలువురు మహిళలు దీపోత్స వాన్ని నిర్వహించారు.

# సొంత నిధులతో కాజ్‌వే మరమ్మతులు చేపట్టిన సింగిల్ విండో ఛైర్మన్




తెగిపోయిన అరగొండ-జొన్నగురకల కాజ్‌వే, మరమ్మతుల అనంతరం రాకపోకలకు సిద్ధమైన కాజ్‌వే

తవణంపల్లె, అక్టోబర్ 27 ప్రభాతవార్త: గత కొద్ది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు బహుదానదిపై అరగొండ సమీపంలో వున్న కాజ్‌వే తెగిపోవడంతో అరగొండ సింగిల్ విండో ఛైర్మన్ ఎ.రంజిత్‌రెడ్డి సోమవారం గ్రామస్థుల సహకారంతో తన సొంత నిధులతో తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టి పూర్తి చేశారు. గత కొద్ది రోజులుగా మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు బహుదానది వరద ఉధృతితో ఉప్పొంగి ప్రవహించడంతో బహుదా నదిపై పలు ప్రాంతాల్లో నిర్మించిన కాజ్‌వేలు కొట్టుకుపోయాయి. ఈమేరకు అరగొండ-సరకల్లు రహదారిలో తొడతర, గాజులపల్లె వద్ద, అరగొండ-జొన్నగురుకల రహదారిలోని అరగొండ వద్ద నిర్మించిన కాజ్‌వే, కాణిపాకం సమీపంలోని పుణ్యసముద్రం వద్ద వున్న కాజ్‌వే వరద ఉధృతికి కొట్టుకుపోయింది.దీనితో పాటు బంగారుపాళ్యం రహదారిలో మత్యం వంకపై దిగువమత్యం సమీపంలో వున్న కాజ్‌వే కూడా తెగిపోయింది.ఈనేపథ్యంలో అరగొండ పరిసర గ్రామాల ప్రజలు, ప్రయాణీకులు, రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన అరగొండ సింగిల్ విండో ఛైర్మన్ ఎ.రంజిత్‌రెడ్డి తన సొంత నిధులతో జెసీబిల సహాయంతో మట్టి తోలి కాజ్‌వే పూర్తిగా కొట్టుకుపోకుండా తాత్కాలిక మరమ్మత్తులకు చేసి రాకపోకలను పునరుద్దరించారు. ఈపనులు పూర్తి చేయడానికి సింగిల విండో డైరక్టర్ వెంకటేష్ మందడి, కిరణరెడ్డిలు తమ వంతు సహకారం అందించగా స్థానిక తహశీల్దార్ సుధాకర్ పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో స్థానికులు యతిరాజులు, సూరి, షణ్ముగం మందడి, నటరాజ్ మందడి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ- రిపబ్లిక్ డే పెరేడ్‌కు ఎంపికైన ఇందుశ్రీ



చిత్తూరురూరల్, అక్టోబరు 27 ప్రభాతవార్త: చిత్తూరుపట్టణం, శ్రీమతి ఎన్‌పి సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా కళాశాలలో బికాం కంప్యూటర్ అప్లికేషన్స్, తృతీయ సంవత్సరం చదువుతున్న కె ఇందుశ్రీ అక్టోబరు 31నుంచి నవంబర్ 9 వరకు పఠాన్‌లోని హేమచంద్రాచార్య నార్త్ గుజరాత్ యూనివర్శిటీలో జరగబోవు ప్రీ రిపబ్లిక్ డే పెరేడ్ క్యాంపుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన ఇందుశ్రీకి కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, వైస్‌ప్రిన్సిపాల్ డా.ఉషారాణి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.ఎస్.షమ్స్ అక్తర్‌లతో పాటు అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థినులు అభినందనలు తెలిపారు.

## ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలి

### - ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు



కుప్పం,అక్టోబర్ 27 ప్రభాతవార్త సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించాలని కుప్పం ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు ఆదేశించారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని చీలేపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు వ్యవసాయ, ఉద్యానవన, పట్టుశాఖల ద్వారా రాయితీలు అందిస్తోందన్నారు. వీటిని రైతులుసద్వినియోగం చేసుకుని రాయితీలు పొందేలా రైతుసేవా కేంద్రాల అధికారులు,సిబ్బంది చొరవ చూపాలన్నారు. కూటమి ప్రభుత్వం రైతుసంక్షేమ ప్రభుత్వమన్నారు. తమ పాలకవర్గం సైతం రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారంకు చొరవ చూపుతామన్నారు. సమావేశంలో ఎఎంసి డైరెక్టర్ ఇర్ఫాన్, నేతలు ప్రతాప్‌సింహ,మురుగేష్, రమేష్,రైతులు పాల్గొన్నారు.

## నేతలు ప్రజలకు అందుబాటులో ఉండాలి



కుప్పం, అక్టోబర్ 27 ప్రభాతవార్త సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో తెదేపా నేతలు, గ్రామ సమన్వయ కమిటీలు ప్రజలకు అ ందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారంకు కృషి చేయాలని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ పేర్కొన్నారు. సోమవారం చందం, దాసేగానూరు,కంగుంది, మొట్లచేను, సదుమూరు, మల్లానూరు,చెక్కునత్తం,పైపాళ్యం పంచాయతీల్లో పార్టీ సమావేశాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ పరిష్కారం కాని సమస్యలు అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో కడ సభ్యుడు రామచంద్ర, నేతలుహైదర్‌వలీ, శ్రీనివాసులు, మురళి, మహేంద్ర,ప్రకాష్, వేడి, గాయత్రి, విభూషణ్,ప్రకాష్, తిరుపతి,కనకరాజు, మణి, వల్లెప్ప పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థికసాయం అందజేత



వి.కోట, అక్టోబర్27 ప్రభాతవార్త మండలంలోని చింతమాకుపల్లి సచివాలయంలో వెటర్నరీ సహాయకుడిగా పనిచేస్తున్న బాలకృష్ణ ఆదివారం హఠాన్మరణం చెందారు. దీంతో అంత్యక్రియల నిమిత్తం ఎంపిపి యువరాజ్ ఆదేశాల మేరకు ప్రభుత్వం తరపున అందాల్సిన నగదును అధికారులు,సిబ్బంది బాలకృష్ణ కుటుంబీకులకు అ ందిం చారు. కాగా బాలకృష్ణ ఆదివారం తనకుటుంబీకులతో కలసి బైరెడ్డిపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్తుండగా అనారోగ్యసమస్యతో అకస్మాత్తుగా కుప్పకూలడంతో కుటుంబీకులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

## అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లో తీసుకెళ్లాలి

గుడుపల్లె,అక్టోబర్27 ప్రభాతవార్త సిఎం చంద్రబాబునాయుడు అధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు,టిడిపి మండల అధ్యక్షుడు సుబ్బు పేర్కొన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల ముఖ్యనేతలు సమావేశమయ్యారు.ఈసందర్భంగా మండలంలో జరుగుతున్నఅభివృద్ధి పనులు,చేయాల్సిన పనులపైచర్చించారు. పిఎంఎవై 2.0పథకంలో లబ్ది పొందేందుకు అర్హులనుగుర్తించాలన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటిసి బేటప్పనాయుడు, స్థానిక నేతలుపాల్గొన్నారు.

## మొగిలీశ్వరాలయంలో కార్తీకశోభ



బంగారుపాళ్యం, అక్టోబర్ 27 ప్రభాతవార్త: స్వయంభూ శ్రీ మొగిలీశ్వరాలయంలో సోమవారం కార్తీక మాసంను పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్తీక మాసం నందు మొదటి సోమవారం కావడంతో పరిసర గ్రామస్తులతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు మొగిలికి విచ్చేశారు. వేకువజామున మూల విరాట్ స్వామి అమ్మ వార్లకు ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేక పూజలు చేపట్టారు. స్వామి దర్శనం కోసం క్యూ లైన్లలో భక్తులు బారులు తీరారు. అలాగే ఆలయ ఆవరణలోని బిల్వమాను వద్ద మహిళలు కార్తీక దీప పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం బెంగళూరు నగరంకు చెందిన జయబాలాజీ భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో మండల వైకాపా యువ నాయకుడు ఎంబి దిలీప్ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లు



చిత్తూరుహెల్త్, అక్టోబర్ 27 ప్రభాతవార్త: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విధులు నిర్వర్తించే పారిశుధ్య కార్మికులకు సోమవారం రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ ఆదేశాల మేరకు వర్షాల నేపథ్యంలో పారిశుధ్య కార్మికులు ఎలాంటి అసౌకర్యానికి గురి కాకుండా విధులు నిర్వర్తించడానికి వీలుగా సుమారు 500 మంది పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్ సోమవారం రెయిన్ కోట్లను అందజేశారు. ఈ మేరకు సోమవారం ఉదయం మస్టర్ పాయింట్ల వద్ద వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ చేశారు.

## నిత్యాన్నదాన పథకానికి విరాళం



శ్రీకాళహస్తి,అక్టోబర్ 27 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి భక్తుల నుంచి భూరి విరాళాలు అందుతున్నాయి.ఈ నేపధ్యంలో కార్తీక సోమవారం చంద్రగిరి వాసులు అన్నదానానికి విరాళం అందించారు. చంద్రగిరికి చెందిన వి.మనోహర్ వారి తల్లిదండ్రులు సరోజనమ్మ, రామకృష్ణయ్యల జ్ఞాపకార్థం నిత్యాన్నదాన పథకానికి రూ.50,116 విరాలంగా అందించారు. విరాళాన్ని ఇఇఒ మోహన్‌కు అందించారు. వారికి ప్రత్యేకాశీర్వచనాలతో పాటు స్వామి అమ్మవార్ల అ ంతరాలయ దర్శనం వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనం అందించారు.

## రాజుకాలువ పరిశీలించిన కమీషనర్.. మరమ్మతులకు ఆదేశం



పలమనేరు, అక్టోబర్ 27, ప్రభాతవార్త: పలమనేరు బాలాజీ కో ఆపరేటివ్ సూపర్ బజార్‌లో నీరు చేరడానికి కారణమైన రాజుకాలువను మున్సిపల్ కమీషనర్ కెవి రమణారెడ్డి సోమవారం పరిశీలించారు. వెంటనే రాజుకాలువ మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఈ నెల 25న రాత్రి భారీ వర్షం కారణంగా సూపర్‌బజార్‌లో మోకాలు లోతు నీరు చేరి దాదాపు రూ.3 లక్షల విలువైన సరుకులు నీటి పాలైన విషయం తెల్సిందే. అప్పటి నుండి సూపర్‌బజార్ మూసివేయడంతో అమ్మకాలు నిలిచిపోయాయి. పలమనేరు కొత్తపేటలో గల బజారువీధి, మారెమ్మగుడి వీధి, జవిళి వీధి, బసవన్నగుడి వీధి,గంగమ్మగుడి వీధి, ఆర్టీసీ బస్టాండు నుండి వచ్చే వర్షపు నీరు మున్సిపల్ కార్యాలయం పక్కనే ఏర్పాటు చేసిన రాజు కాలువ చేరుతుంది. ఇక కొత్తపేటలో ఇళ్ళ నుండి వచ్చే మురుగునీరు కూడా వీధి కాలువల ద్వారా రాజు కాలవలో చేరి పట్టణ సమీపంలోని పెద్దచెరువులో చేరుతుంది. ఈ నేపథ్యంలో భారీ వర్షం పడడంతో రాజు కాలువ పూర్తి స్థాయిలో నిండిపోవడం, కాలువలో చెత్తకుప్పలు పేరుకు పోవడంతో నీరు కాలువ నుండి వెళ్ళలేక ఆర్టీసీ బస్టాండులోనూ సూపర్‌బజార్ ఆవరణలోనూ నిండిపోయింది. ఈ నీరంతా ప్రవేశించడంతో సూపర్‌బజార్ నీటి మడుగుగా మారింది. దీంతో స్పందించిన కమీషనర్ రాజు కాలువ తక్షణ మరమ్మత్తు పనులకు చేపట్టాలని నిర్ణయించారు. మరో సారి వర్షపు నీరు సూపర్‌బజార్‌లో ప్రవేశించే పరిస్థితి రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

## పొలాల్లో బోల్తాపడ్డ గ్రానైట్ లారీ..తప్పిన ప్రమాదం



శాంతిపురం, అక్టోబర్27 ప్రభాతవార్త గ్రానైట్ దిమ్మెల లోడ్డుతో వెళ్తున్న ఓ లారీ అదుపు తప్పి పంట పొలాల్లో బోల్తా పడింది. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మండలంలోని సోమాపురం గ్రామ సమీపంలో ఈ సంఘటన చోటుచేసుకుంది.అయితే ఈ సంఘటన జరిగిన సమయంలో పొలాల వద్ద ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. లారీ, దిమ్మెలు పడడంతో సాగులో ఉన్న పంట కొంతమేర దెబ్బతింది.అయితే సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

## దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన జయప్రదం చేయాలి

రామకుప్పం,అక్టోబర్ 27 ప్రభాతవార్త



సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ పద్మశ్రీ మందకృష్ణమాదిగ ఆదేశాల మేరకు నవంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే దళితుల ఆత్మగౌరవ నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్, కుప్పం ఎంఎస్‌పి కో ఇన్‌చార్జ్ వెంకటేష్ కోరారు. దేశవ్యాప్తంగా దాడులకు దిగే వ్యక్తులకు, శక్తులకు భయం కలిగేలా ఈ ఆత్మగౌరవ ర్యాలీని విజయవంతం చేసేందుకు కుప్పంనుంచి అధిక సంఖ్యలో ప్రజలుహాజరు కావాలని కోరారు.కార్యక్రమంలో నేతలు పాపన్న, గోవింద, జయప్ప, రవీంద్ర, విజయ్‌కుమార్, పళని,రమేష్, వెంకటేష్, శంకర్‌గణేష్, మణికంఠ, సుబ్రమణి, బాబు, మునివెంకటప్ప, రంగప్ప,సెల్వరాజ్ పాల్గొన్నారు.

## కిటకిటలాడిన శివాలయం - పోటెత్తిన భక్తజనం



పలమనేరు టౌన్, అక్టోబర్ 27, ప్రభాతవార్త: కార్తీక సోమవారం కావడంతో పలమనేరులో వెలసిన కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం భక్తజనంతో కిటకిటలాడింది. తుఫాన్ ప్రభావంతో వర్షం పడుతున్నా తెల్లవారు జామున 4 గంటల నుండే ఆలయం భక్తుల రద్దీతో నిండిపోయింది. ఆలయ అర్చకులు స్వామి వారిని, కాశీవిశాలాక్షి అమ్మవారిని పట్టువస్త్రాలు పూలతో అలంకరించి విశేష పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు శఠగోపంతో ఆశీర్వాదాలు అందజేశారు. మహిళలు ఆలయ ఆవరణలో ఉదయం నుండి సాయంత్రం వరకు పసుపు కుంకుమలు, టెంకాయ కర్పూరాలు, దీపారాధనతో పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ నూతన కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ నెల 31న శివాలయంలో నూతన ఆలయ కమిటీ అధ్యక్షుడుగా మురళీ క్రిష్ణ, పలువురు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేస్తారు.

## కల్లూరు శివాలయంలో విశేష పూజలు

కల్లూరు, అక్టోబర్ 27, ప్రభాతవార్త పులిచెర్ల మండలం కల్లూరు శ్రీ ప్రసన్న గౌరీదేవి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం తొలి సోమవారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామి వారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు పూజలు జరిపి నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి గావించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ ప్రధాన అర్చకులు రామచంద్రరావు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కల్లూరు, అక్టోబర్ 27, ప్రభాతవార్త తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శి గణేష్ అన్నారు. పులిచెర్ల మండలం అయ్యా వాండ్లపల్లి పంచాయతీ పరిధిలో సోమవారం తుఫాన్ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కార్యదర్శి గణేష్ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చెంద్ర రాయలు, టిడిపి నాయకులు కిరణ్ కుమార్, డిజిటల్ అసిస్టెంట్ వినోద్, జి ఎం ఎస్ కె మానస, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జడ్పీలో మరో ఐదుగురికి పదోన్నతులు

చిత్తూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త: జిల్లా పరిషత్ పరిధిలో మరో ఐదు మంది జూనియర్ అసిస్టెంట్లకు సోమవారం సీనియర్ అసిస్టెంట్లుగా జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జడ్పీ సిఇఓ రవికుమార్ నాయుడు పదోన్నతులు కల్పించి నియామక ఉత్తర్వులు అందజేశారు. జిల్లా పరిషత్ పరిధిలో రెండు రోజుల క్రితం ఏడు మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించిన విషయం తెలిసిందే. ఈ మేరకు అర్హులైన మరో ఐదు మంది జూనియర్ అసిస్టెంట్లకు సోమవారం పదోన్నతులు కల్పించి నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

## కొమరంభీమ్ ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయుడు



చిత్తూరుహెల్త్, అక్టోబర్ 27 ప్రభాతవార్త: ఆదివాసీలకే కాకుండా ప్రతి ఒక్కరికి కొమరం భీమ్ ఆదర్శప్రాయుడని బిజెపి సీనియర్ నాయకుడు చిట్టిబాబు కొల్లా పేర్కొన్నారు. కొమరం భీమ్ వర్ధంతని సోమవారం బిజెపి సీనియర్ నాయకులు చిట్టిబాబు కొల్లా ఆధ్వర్యంలో జర్రిమడుగు గిరిజన కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు కొల్లా కొమరంభీమ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడుతూ నిజాం పాలనకు వ్యతిరేకంగా గోండు ప్రజల హక్కు కోసం పోరాడిన వ్యక్తిగా కొమరంభీమ్ అందరికి పరిచయం అన్నారు. ఈ సందర్భంగా గిరిజన కాలనీ వాసులను చిట్టిబాబు కొల్లా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మోర్చా నాయకులు చంద్ర, రెడ్డి మస్తాన్, సుబ్రమణ్యం, కేశవ, లక్ష్మయ్య, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి రెండో మార్గం ఏర్పాటుకు చర్యలు



చిత్తూరురూరల్, అక్టోబరు 27 ప్రభాతవార్త: చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి ప్రస్తుతం వున్న మార్గంతో పాటు రెండవదారి ఏర్పాటుపై అధికారులు పరిశీలన చేపట్టారు. సోమవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆదేశాల మేరకు అపోలో యాజ మాన్యం, కమిటీ సభ్యులు, నగరపాలక అధికారులు సంయుక్తంగా రెండవ దారి ఏర్పాటుపై పరిశీలన చేసారు. గతంలో రెండు దారులు వుండగా కాలక్రమంలో ఒక దారి అన్యాక్రాంతం కావడం జరిగింది. ప్రస్తుతం చర్చివీధి మీదుగా ఒకే దారి వుండడం రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో గంగనపల్లి చింతమాను సర్కిల్ నుంచి రెండవ దారి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నరసింహప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, అపోలో ఆసుపత్రి సిఓఓ నరేష్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పిఏ కుమారస్వామియాదవ్, ఆసుపత్రి అధికారులు, సభ్యులు సురేష్, అరుణ, ప్రధాన కార్యదర్శి పచ్చప్ప, కార్పొరేటర్ శశి, వరదరాజులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## జోగివారిపల్లి నుంచి దామలచెరువుకు రోడ్డు సౌకర్యం కల్పించాలి

సదుం, అక్టోబర్ 27 ప్రభాతవార్త సదుం మండలం జోగివారిపల్లె నుంచి దామల చెరువుకు రోడ్డు మార్గం కల్పించాలని పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్‌కు వినతి పత్రాన్ని అందజేసినట్లు ఆ గ్రామస్తుడు మనోహర్ తెలిపారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ మామిడికాయల సీజన్ సమయంలో దామల చెరువుకు సదుం మీదుగా వెళ్లాలంటే 23 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుందని అదే జోగువారిపల్లె అటవీ ప్రాంతం కేవలం నాలుగు కిలోమీటర్లు మాత్రమే సరిహద్దు ఉందని, ప్రస్తుతం ద్వి చక్ర వాహనాలు పోయేందుకు వీలుగా బండిబాట ఉందని, తెలియజేశారు .ప్రభుత్వం, జిల్లా అధికారులు స్పందించి ఈ మార్గంలో రోడ్డు మార్గం ఏర్పాటు చేస్తే ఇటు చుట్టుపక్కల ఉన్న రైతులకు, వ్యాపారస్తులకు ప్రజలకు అనువుగా ఉంటుందని ఆయన మంత్రి మనోహర్ కి ఇచ్చిన వినతి పత్రంలో వివరించారు. స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో చర్చించి నాలుగు కిలోమీటర్లు రోడ్డు మార్గాన్ని కోసం ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు.

## కార్తీక తొలి సోమవారం ప్రత్యేక పూజలు



సదుం, అక్టోబర్ 27 ప్రభాతవార్త మండలంలోని పలు దేవాలయాల్లో కార్తీక తొలి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు .నడిగడ్డ మతుకువారిపల్లె మల్లేశ్వర స్వామి వారి ఆలయంలోనూ సదంలోని శ్రీ వీరభద్ర స్వామి వారి ఆలయంలోనూ, శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలోని మరకత లింగేశ్వర స్వామి వారి ఆలయంలో ను జాంద్రపేటలోని అరుణాచల స్వామి ఆలయంలోనూఉదయం నుంచి ప్రత్యేక అభిషేకలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం స్వామి వార్లకు వివిధ రకాల తైలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించారు.

## సిఎంచే పరిశ్రమల శంకుస్థాపన వాయిదా : కడ పి.డి.



కుప్పం,అక్టోబర్ 27 ప్రభాతవార్త సిఎం చంద్రబాబునాయుడుచే మంగళవారం వర్చువల్ విధానంలో జరగాల్సిన పరిశ్రమల శంకుస్థాపన కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా పడినట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. మొంథా తుఫాను కారణంగా ఈకార్యక్రమం వాయిదా పడిందన్నారు. తదుపరి కార్యక్రమం నిర్వహణ ఎప్పుడనే విషయంగా తగు సమాచారం త్వరలో వెల్లడిస్తామన్నారు. కాగా కుప్పంలో 2203కోట్లతో ఏర్పాటుకానున్న ఏడు పరిశ్రమలకు సిఎం చంద్రబాబునాయుడు త్వరలోనే శంకుస్థాపన చేయనున్నారు.

## బస్సు ఘటనలో త్రిమూర్తి మృతి బాధాకరం

### - ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం



కుప్పం,అక్టోబర్ 27 ప్రభాతవార్త కర్నూలుజిల్లాలో జరిగిన ప్రైవేట్ బస్సు దగ్ధమైన ఘటనలో యామనూరుకుచెందిన కాంగ్రెస్ సీనియర్ నేత త్రిమూర్తి మృతిచెందడం బాధాకరమని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. సోమవారం ఆయన యామనూరుకుచేరుకుని త్రిమూర్తి మృతదేహానికి నివాళులు అర్పించి వారి కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, స్థానిక నేతలు శ్రీనివాసులుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో కేదారీ నోములు



చౌడేపల్లి, అక్టోబర్ 27 ప్రభాతవార్త స్థానిక మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో కేదారీ నోములను భక్తి శ్రద్ధలతో జరిపుకొన్నారు. కార్తీక సోమవారంను పురష్కరించుకొని ఆలయ ప్రధానార్చకులు రాజశేఖర్‌దీక్షితులు, కుమార స్వామి, మహేష్‌లు స్వామివారికి ఉదయాన్నే విశేషాభిషేకం, అలంకరణగావించారు. మండలంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి కేదారీ నోములను నోచుకొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయింది.

## ఆర్టీసీ బస్టాండులో అనాధ శవం

### -మానవత్వం చాటుకున్న అధికారులు



చౌడేపల్లి, అక్టోబర్ 27 ప్రభాతవార్త ఆర్టీసీ బస్టాడులో యాచకురాలు మృతి చెందింది. అనాధ శవానికి అంత్యక్రియలు నిర్వహించి అధికారులు మానవత్వాన్ని చాటుకొన్నారు. కర్ణాటక రాష్ట్రం చిక్కబళ్ళాపురంకు చెందిన లక్ష్మదేవీ(55)అనే మహిళ గత 4యేళ్ళ క్రితం చౌడేపల్లికి చేరుకొంది. పట్టణంలో భిక్షాటన చేసుకొంటూ స్థానిక ఆర్టీసీ బస్టాండులో తలదాచుకొంటోంది. ఈక్రమంలో లక్ష్మీదేవి అనారోగ్యం పాలైంది. వ్యాధి తీవ్రత అధికం కావడంతో ఆదివారం రాత్రి మృతి చెందింది. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు, పంచాయతీ కార్యదర్శి జాకీర్‌హుసేన్, విఆర్వో విజయ్‌కుమార్‌రెడ్డిలు పంచాయతీ సిబ్బంది సహాయంతో అనాధ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు.

## నగదు ప్రోత్సాహకాల కోసం ఆన్‌లైన్ ధరఖాస్తులు

చిత్తూరురూరల్, అక్టోబరు 27 ప్రభాతవార్త: రాష్ట్ర క్రీడా ప్రాధికాసంస్థ ఆదేశాల మేరకు జాతీయ, అంతర్జాతీయ క్రీడాపోటీల్లో రాణించి పతకాలను సాధించిన అత్యుత్తమ క్రీడాకారులను గుర్తించి నగదు బహుమతితో ప్రోత్సహించడం కోసం వారి నుంచి ఆన్‌లైన్ ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎ బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా విధానం (2024-29) ప్రకారం, అర్హత కలిగిన క్రీడాకారులు నగదు ప్రోత్సాహకాల కోసం ధరఖాస్తులను నవంబర్ 4వ తేది లోపు ఆన్‌లైన్ లింక్ https://sports.ap.gov.in/#/registration/players-registration ద్వారా తగిన క్రీడా పత్రములతో సమర్పించాలని కోరారు.

## తుఫాను నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో అందుబాటు

### - మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్



చిత్తూరుహెల్త్, అక్టోబర్ 27 ప్రభాతవార్త: మొంథా తుఫాను నేపథ్యంలో భారీ వర్షాలు నమోదు అయ్యే అవకాశం వుండటంతో క్షేత్ర స్థాయి అధికారులు అదుబాటులో వుండాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడుతూ తుఫాను నేపథ్యంలో సోమవారం రాత్రి, మంగళవారం అకస్మికంగా వర్షాలు కురిసే అవకాశం వుందని, ఇప్పటికే చెరువులు నీటితో నిండి పొంగి ప్రవహిస్తున్న పరిస్థితుల్లో క్షేత్ర స్థాయిలలో ప్రతి ఒక్కరు అందుబాటులో వుండాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా నీవానది పరివాహక ప్రాంతాల్లోని డివిజన్లలో విధులు కేటాయించిన అధికారులు, కార్యదర్శులు తప్పనిసరిగా ప్రజలను అప్రమత్తం చేయాలని, ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారం అందజేయాలని ఆదేశించారు. అలాగే సంతపేట, ఇతర లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. కాలువల్లో నీటి మట్టం పెరిగితే వేగంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్, జెసిబిలు, ఇతర పనిముట్లను అందుబాటులో వుంచుకోవాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో అసిస్టెంట్ కమీషనర్ ప్రసాద్, ఎంఇ వెంకటరామిరెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఎసిపీ నాగేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అధ్వానంగా ఉన్న రోడ్లు, కాజ్‌వే మరమ్మతులు చేపట్టండి

- రోడ్లు, కాజ్ వే దుస్థితి పరిశీలనకు రావాలి
- జిల్లా కలెక్టర్ ను కోరిన ఎమ్మెల్యే కోనేటి -
వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే

పిచ్చాటూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త: సత్యవేడు నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న రోడ్లు, కాజ్ వేలకు మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లును కోరారు. సోమవారం ఉదయం ఎమ్మెల్యే ఆదిమూలం తిరుపతిలోని కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నారాయణ వనం మండలంలోని తిరువట్యాం, తుంబూరు, పాలమంగళం, కెవిబి పురం మండలం సికె పూడి కాజ్ వేలు వర్షం పడ్డ ప్రతిసారీ కొట్టుకుపోతుందని కలెక్టర్‌కు వివరించారు. నాగలాపురం మండలం టీపీ కోట రోడ్డు, పాండూరు పీవీపురం రోడ్డు అధ్వానంగా ఉందని రోడ్డుపై కనీసం మనుషులు తిరగలేని పరిస్థితి అని, ఇక



వాహనాలు ప్రయాణం చేయలేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. బుచ్చి నాయుడు కండ్రిగ మండలం ఆర్.అనంతపురం, జంబుగులం రోడ్డు, సత్య వేడు మండలం లోని కృష్ణాపురం, అలపగుంట రోడ్డు దుస్థితిలో ఉందని ఎమ్మెల్యే వివరించారు. అందుకు కలెక్టర్ స్పందించి ఈ మూడు రోజులు వర్షాలు నిలిచిన తర్వాత తప్పక సత్యవేడు నియోజకవర్గంలో పర్యటిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. నియోజకవర్గం లోని అరణియార్, కాలంగి ప్రాజెక్టులపై గట్టి నిఘా పెట్టాలని, ఎవరూ నదులు, వాగులు దాటకుండా చూడాలని ఇరిగేషన్, పోలీస్, రెవిన్యూ శాఖలకు ఎమ్మెల్యే సూచించారు.

# తిరుపతి డివిజన్

## అప్రమత్తంగా ఉండండి

సత్యవేడు, అక్టోబరు 27 ప్రభాతవార్త: మొంథా తుఫాను పట్ల మండలంలో అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని సత్యవేడు తహసీల్దార్ రాజశేఖర్ కోరారు. సోమవారం తహసీల్దార్ పలు గ్రామ పంచాయతీలో చెరువులు, రోడ్లు పరిశీలించి కార్యదర్శులతో మొంతా తుఫానుప్రభావంతో తీసుకోవాల్సి న ముందస్తు జాగ్రత్తలపై ఆయన మండల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు తప్పని సరిగా మండలకేంద్రంలో అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. మొంథా తుఫానును తేలికగా తీసుకోవద్దన్నారు. రెండు రోజుల్లో వర్షం, గాలి తీవ్రంగా ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇది మరింత తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని ఎప్పటికప్పుడు పరిస్థితులపై ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

## మద్యం మత్తులో దంపతులపై దాడి!



విజయపురం, అక్టోబరు 27 ప్రభాతవార్త: మద్యం మత్తులో మునస్వామి(57), అంజల(45) దంపతులపై దాడి చేసిన సంఘటన మండలంలోని ఎల్ల సముద్రంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు... ఒంటరిగా పశువులను మేపుతున్న మునస్వామిపై మద్యం సీసా పగులగొట్టి చేతి వెళ్ళపై, వీపు పై రక్తగాయాలు ఏర్పరచడంతో అతని భార్య అడ్డుకోవడానికి ప్రయత్నం చేయడంతో ఆమె చేతిపై కూడా పగిలిన సీసాతో రక్త గాయాలు ఏర్పరచారు. గాయపడిన వారిని నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. నింద్ర మండలం నెట్టేరి ఆది ఆంధ్రవాడకు చెందిన నరేష్, రాజేష్ కొంత కాలంగా ఎల్ల సముద్రం ఆది ఆంధ్రవాడలో నివాసం ఉంటున్నారని, కొన్ని రోజుల క్రితం మునస్వామితో విబేధాలు చోటు చేసుకుందని, ఆ కక్షతోనే దాడి చేసినట్టు తెలిపారు. దాడి చేసిన వ్యక్తితో పాటు నింద్ర మండలం పాదిరికి చెందిన జీవేష్, వెంకటేష్, తమిళనాడు అరక్కోణంకు చెందిన యోగేష్ ఉన్నారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మహేష్‌బాబు తెలిపారు.

**మద్యం, గంజాయి మత్తులో దాడి చేశారు:**

మద్యం, గంజాయి మత్తులో నాపై దాడి చేశారని బాధితుడు మునస్వామి ఆరోపించారు. గతంలో పొలంలో ఆవులు మేస్తున్న దగ్గర మీకు ఏమి అంటూ ప్రశ్నిస్తే అప్పుడు కూడా దాడి చేయడాని ప్రయత్నంచారని, రాత్రి, పగలు కూడా లేకుండా రోడ్డుపైనే వీర విహారం చేస్తారని, రోడ్డు నుంచి ఇంటికి వెళ్ళడానికి కూడా ఇబ్బంది పడుతున్నామని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన అధికారులు

విజయపురం, అక్టోబరు 27 ప్రభాతవార్త: మండలంలో లో తట్టు ప్రాంతాలను తహసీల్దార్ కిరణ్, ఇరిగేషన్ ఏఈ ప్రశాంత్, ట్రాన్స్‌కో అధికారులు సోమవారం పరిశీలించారు. మండలంలోని పన్నూరు ఆది ఆంధ్రవాడలో గతంలో ఇంటిలోకి వర్షపునీరు చొరబడిన ప్రాంతాలను పరిశీలించారు. మహారాజపురం ఆది ఆంధ్రవాడలో పరిశీలించారు. చెత్తాచదారం లేకుండా వర్షపునీరు నిలవకుండా ఎక్కవేటర్‌తో అడ్డులను తొలగించారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## జగన్నాథపురంలో చోరీ!

విజయపురం, అక్టోబరు 27 ప్రభాతవార్త: మండలంలోని జగన్నాథపురంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు మూడు ఇళ్ళలో చోరీకి ప్రయత్నాలు చేశారు. కానీ అక్కడ కూడా ఏమీ లభించకపోవడంతో మంజుల ఇంట్లోకి దూరి ఒక లక్ష రూపాయలు చోరీ చేసినట్లు తెలిపారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మహేష్‌బాబు తెలిపారు.

## మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పుదూరు హఠాన్మరణం

శ్రీకాళహస్తి, అక్టోబర్ 27 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, ప్రస్తుతం పొన్నాలమ్మగుడి చైర్మన్ పుదూరు లక్ష్మణరెడ్డి (73) సోమవారం ఉదయం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. సోమవారం ఉదయం ఆయన చెన్నైకు వైద్య సదుపాయం కోసం వెళ్ళాల్సి ఉంది. ఈ నేపథ్యంలో బయలు దేరగా కారు వద్ద కుప్ప కూలి పోయినట్లు కుటుంబసభ్యులు వివరించారు. 1983లో ఎన్‌టిరామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించినపుడు సభ్యత్వం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి మున్సిపల్ వైస్ చైర్మన్ అయ్యారు. ఆయనహయాంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గత పదేళ్లుగా పానగల్‌లో వెలసిన పొన్నాలమ్మ ఆలయ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి ఆలయాభివృద్ధితో పాటు



సామాన్యులకు అందుబాటులో ఉండేటట్లు కళ్యాణ మండపాన్ని నిర్మించారు. పుదూరు లక్ష్మణరెడ్డి హఠాన్మరణం వార్త తెలుసుకున్న రష్ అధినేత ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసధనరెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, పివిఆర్ గ్రూప్ డైరెక్టర్ పరమేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ మురుగేశం, రత్నం రెడ్డి, ఆర్కట్ శంకర్, అక్కాటుముత్తు, లక్ష్మీపతి, సాధన మునస్వామి రాయల్, స్వామి రెడ్డి భరత్‌రెడ్డి, కంఠా ఉదయ్ కుమార్, కంచి గురవయ్య, బాలా గౌడ్, జీవికే రెడ్డి, పట్టణ ప్రముఖులు హాజరై నివాళులర్పించారు. మాజీ మున్సిపల్ చైర్మెన్ తీగల చంద్రశేఖర్ వైస్ చైర్మెన్ సి.జయగోపాల్ పలువురు మాజీ కౌన్సిలర్లు సంతాపాలు తెలిపారు.

## ధర్మకర్తల మండలి సభ్యురాలిని సత్కరించిన బాలు



శ్రీకాళహస్తి, అక్టోబర్ 27 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సభ్యురాలిగా నియమించిన కొమ్మనబోయిన రజనీని శ్రీకాళహస్తికి చెందిన తెలుగుదేశం సీనియర్ నాయ కుడు మాజీ టౌన్‌బ్యాంకు డైరెక్టర్ బాలు డిల్లిబాలు ఘనంగా సత్కరించారు. ఆమెతో పాటు వచ్చిన చీరాల తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి బుర్ర కవిత, మాజీ ఏఎంసి డైరెక్టర్ ఆవుల హిన బిందు దుశ్శాలువలతో సత్కరించారు. తమ సామాజిక వర్గానికి ధర్మకర్తల మండలిలో అవకాశం కల్పించిన స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

## కౌమార అభివృద్ధి పథకం కోసం దరఖాస్తు

తిరుపతి క్రీడ, అక్టోబర్ 27 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం 2025 -26 సంవత్సరం నందు యువత, కౌమార అభివృద్ధి జాతీయ పథకం నిర్వహించిన ఎన్‌పిఒ, ఎన్‌జిఒస్ నుంచి నిధులు పొందుటకు ప్రతిపాదనలు, దరఖాస్తులు చేసుకోవాలని సెట్విన్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి యశ్వంత్ తెలిపారు. అర్హత గల ఎన్‌పిఒ, ఎన్‌జిఒ వారు హెచ్‌టిటిపి://ఎన్‌జిఒదార్పన్.జిఒవి.ఇన్ వెబ్ సైట్ నందు నవంబర్ 1వ తేది నుంచి 30వ తేది లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహించిన యొడల కేంద్ర ప్రభుత్వం సంబంధిత ఎన్‌పిఒస్, ఎన్‌జిఒస్ ఆర్గనైజేషన్స్ వారికి నిధులు మంజూరు చేయబడునన్నారు. మరిన్ని వివరాల కొరకు వెబ్‌సైట్ నందు తెలసుకోవాలన్నారు.

## యువజనోత్సవాల్లో మొదటి స్థానం కైవసం



తిరుపతి విద్య, అక్టోబర్ 27 ప్రభాత వార్త: ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు యువజనోత్సవాలలో భాగంగా జానపద నృత్యంలో చక్కని ప్రతిభను కనబరచి జిల్లా స్థాయిలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకు న్నారని కళాశాల ప్రిన్సిపల్ డా.బి సత్యనారాయణ తెలిపారు. సెట్విన్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి, జిల్లా కలెక్టర్ డా.వెంకటేశ్వర్లు విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.సత్యనారాయణ, కళాశాల ఫైన్ ఆర్ట్స్ కన్వీనర్ డా.జే.కొండలరావు, డా.ఎన్ వినోద్, ఇతర అధ్యాపక బృందం విద్యార్థులను విద్యార్థులు ఇంతటి చక్కని ప్రతిభను ప్రదర్శించడానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిన కళాశాల ఫైన్ ఆర్ట్స్ కన్వీనర్ డా.జే కొండలరావుకి, నృత్యం నేర్పిన హేమంత్ మాస్టర్, నరేష్ మాస్టర్ లకు ఈ విజయభాస్కర్, కే.భాస్కరన్, బి సులోచన రాణి, డా.కే వెంకటేష్ డా.కే కోటేశ్వరయ్య, ఇతర అధ్యాపక బృందానికి విద్యార్థులు ధన్యవాదములు తెలియజేశారు.

## ప్రమాద స్థలాలను గుర్తించి సమాచారం అందించండి : ఎస్పీ గిరీషా



గంగాధర నెల్లూరు అక్టోబరు 27 ప్రభాతవార్త: మండలంలోని ప్రమాద స్థలాలను వెంటనే గుర్తించి తమకు సమాచారం అందించాలని జిల్లా ప్రత్యేక అధికారి ఎస్పీ గిరీషా జిల్లా కలెక్టర్ సమీర్ కుమార్ మండల స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం మండల అధికారుల సమాచారం మేరకు మండలంలోని ఆత్మ కూరు చెరువు కట్టను పరిశీలించి ప్రమాద స్థాయిలో ఉన్న ఈ చెరువు కట్టను వెంటనే ఎస్టిమేషన్ వేసి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని ఆదేశించారు. బృందం లోనే ఉన్న పంచాయతీరాజ్ అధికారులు సుమారు 20 నుండి 25 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలపడంతో పనులను వెంటనే ప్రారంభించాలని తెలిపారు. అలాగే మండలంలోని సుమారు 26 చెరువులు పూర్తిగా నిండిపోయాయని సమాచారం వుందని అధికారులు ప్రమాద స్థాయిలో ఉన్న చెరువులను వెంటనే గుర్తించి తమకు సమాచారం అందించాలని, అప్పుడే రైతు పంటలనే కాక ఇతర ప్రమాదాల నుంచి ప్రజలను రక్షించగలుగుతామని అన్నారు. పంచాయతిరాజ్ ఇంజనీర్లు ఆనంద్‌రెడ్డి సుధాకర్ రావు తహసిల్దార్ శ్రీనివాసులు కార్యదర్శి శివయ్య కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏనుగుల సంచారం, తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఎంఎల్‌ఏ



చంద్రగిరి, అక్టోబర్ 27 ప్రభాతవార్త: మరో నాలుగు రోజుల పాటు మొంథా తుఫాన్ ప్రభావ ంతో భారీ వర్షాలు కురిసే అవకాశం వున్నందున ప్రజలు అప్రమత్తంగా వుండాలని ఎంఎల్‌ఏ పులివర్తి నాని అన్నారు. మండల పరిధిలో ఏనుగులు సంచరిస్తున్న, తుఫాన్ ప్రభావిత చిన్నరామాపురం, మూలపల్లి, కొండ్రెడ్డి కండ్రిగ గ్రామాలలో సోమవారం ఆయన విస్తృత పర్యటన చేశారు. ఆయన మాట్లాడుతూ ఏనుగులు సంచరించే ప్రదేశాలను తాను స్వయంగా పరిశీలించడం జరిగిందన్నారు. తుఫాన్ కారణంగా వాగులు, వంకలలో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తున్నందున చిన్నపిల్లలు, యువకులు ఈత కోసం ఇంటి నుండి బయటకు రాకుండా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఏనుగుల కదలికను పసిగట్టివాటిని అడవుల్లోకి తరిమేసేచర్యలు తీసుకోవాలని అటవీశాఖఅధికారులను ఆదేశించారు.

## పాలిటెక్నిక్ విద్యార్థుల పారిశుధ్య పనులు

చంద్రగిరి, అక్టోబర్ 27 ప్రభాతవార్త: ఎస్‌వి పాలిటెక్నిక్ (తిరుపతి) ఎన్‌సిసి క్యాడెట్స్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (చంద్రగిరి) విద్యార్థులు సంయుక్తంగా బుచ్చినాయుడుపల్లిలో సోమవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఆంధ్ర ఇంజనీర్ కంపెనీ, ఎన్‌సిసి క్యాడెట్స్, అధికారులు బుచ్చినాయుడు పల్లి పంచాయతీని దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా కర్నల్ కడియాల శ్రీనివాసులు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతలో భాగంగా గ్రామంలోని రోడ్లను, ఎంపిపి స్కూల్ పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు జంగిల్ క్లీనింగ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కె.పట్టాభిరామానాయుడు, గ్రామస్థులు సహకరించినట్లు తెలిపారు. పంచాయతీ సర్పంచ్ మావికొండ రవి నాయుడు ద్వారా చెత్తకుండీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుబేదార్ కె.మణికంధన్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా వుండాలి : తహశీల్దార్



రామచంద్రాపురం, అక్టోబర్ 27 ప్రభాతవార్త: మొంథా తుఫాన్ ప్రభావంతో మండలంలో భారీ వర్షాలు కురిసే అవకాశాలు వున్నాయని ప్రజలు అప్రమత్తంగా వుండాలని తహశీల్దార్ మధు సూదన్ రావు సూచించారు. సోమవారం సికె పల్లి పంచాయతీలోని ముంపు గ్రామాలలో ఎస్ఐ భక్తవత్సలం, ఇరిగేషన్ ఏఈ యతిరాజులుతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ముంపు గ్రామాల ప్రజలకు తగు సూచినలు, సలహాలు ఇచ్చారు. రాయలచెరువులో ప్రస్తుత నీటి మట్టం 40 శాతం మాత్రమే వుందనీ, ఎటువంటి ప్రమాదం లేదన్నారు. పర్యాటకులకు ప్రవేశం లేదని తేల్చిచెప్పారు.

## నిద్రపోతున్న మండల అధికార యంత్రాంగం

భాకరాపేట, అక్టోబర్ 27 ప్రభాతవార్త: ముంతా తుఫాను నేపథ్యంలో జిల్లా, రాష్ట్ర అధికార యంత్రాంగం హెచ్చరికలు జారిచేస్తున్నా, ప్రజా ప్రతినిధులు పలు ప్రాంతాలను పరిశీలించి తగు సూచనలు చేస్తున్నారు. కానీ చిన్నగొట్టిగల్లు అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తి నట్టు వ్యవహరిస్తున్నారని పలువురు వాపోయారు. మండల కేంద్రంలోని రహదారికి ఆనుకొని ఒక కాలువ జగనన్న కాలనీ నుండి ప్రారంభం అయిచిన్నగొట్టిగల్లు చెరువులో కలుస్తుంది. ఇది చిన్నపాటి వర్షానికి విద్యుత్ కార్యాలయం దగ్గర గండి పడి చుట్టుపక్కలున్న ఇళ్లలోకి దూరి తీవ్రనష్టం కలగచేస్తుంది అది తెలిసిన పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితిస్తోంది. ఆలాగే ప్రభుత్వ కార్యాలయలకు కూతవేటు దూరంలో నిర్మాణంలో ఉన్న సాయి బాబా గుడి ఎదురుగ నీరు నిలిచి పోతున్న పట్టించుకోకపోవడం విశేషం ఇప్పటికయినా స్పందించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వార్తా ప్రభావం

## అడ్డుగోడ కూల్చివేసిన రెవెన్యూ



రేణిగుంట, అక్టోబర్ 27 ప్రభాతవార్త: మండలంలోని కుర్ర కాలవ సర్వే నంబర్ 18 చెరువు పోరంబోకు ప్రవాహానికి కలుజు వద్ద అడ్డంగా నిర్మించిన ప్రహరీ గోడను రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి రెవిన్యూ అధికారులు పోలీసు బందోబస్తుతో సోమవారం జెసిబి తో కూల్చివేశారు. బంగాళాఖాతంలో ఆగ్నేయ దిశగా ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత నాలుగు రోజులుగా రేణిగుంట మండలంలో విస్తృతంగా వర్షాలు కురిసిన విషయం విధితమే. రేణిగుంట మండలం కురకాలవ సర్వే నంబర్ 18 నందు కొంతమంది రియల్టర్లు కలుజుకు అడ్డంగా ప్రహరీ గోడ నిర్మించడం వల్ల నీటి ప్రవాహానికి అడ్డంకి ఏర్పడడం వల్ల వర్షపు నీరు పద్మా నగర్, జగనన్న కాలనీలను పూర్తిగా ముంపుకు గురిచేసాయి. ఆ ప్రాంతవాసులు పడిన ఇక్కట్లు వర్ణనాతీతం. ప్రజలు పడిన ఇక్కట్లను ప్రభాతవార్త ప్రతినిధి తహసిల్దార్ కి తెలియజేయడమే కాకుండా, అడ్డుకోడను తొలగిస్తామని వార్త దినపత్రికలో తహసిల్దార్ ఇచ్చిన హామీని ప్రచురించడం జరిగింది. పాత రెవిన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆ ప్రాంతవాసులు అధికారులను అభ్యర్థిస్తున్నారు. ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

## కోలా విశాలికి ఘన సత్కారం



రేణిగుంట అక్టోబర్ 27 ప్రభాతవార్త. శ్రీకాళహస్తి దేవస్థానం బోర్డు సభ్యురాలుగా ప్రమాణస్వీకారం చేసిన బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ కుమార్ సతీమణి కోలా విశాలిని రేణిగుంట లారీ ట్రాన్స్పోర్ట్ యూనియన్ నేతలు, సభ్యులు సోమవారం కోలా నివాసంలో శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు. మంచి మనసున్న ఆదర్శ దంపతులుగా కోలా దంపతులను కొనియాడారు. సత్కరించిన వారిలో యూనియన్ నాయకులు గణపతి రాయల్, రాజా రాయల్, రాముడ్డి, ప్రకాష్, బిజెపి రేణిగుంట పట్టణ అధ్యక్షుడు నరేష్ రాయల్ తదితరులు ఉన్నారు.

## ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్



తిరుపతి విద్య, అక్టోబర్ 27 ప్రభాతవార్త: ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్ కాన్సెప్ట్‌లు, టూల్స్, ఎమర్జింగ్ అప్లికేషన్‌లు అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ అక్టోబర్ 27 నుండి నవంబర్ 1, 2025 వరకు చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కాలేజీ, సోమవారం ఆన్‌లైన్‌లో ఘనంగా ప్రారంభ మైంది. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథులుగా చైర్మన్ డా. చదలవాడ కృష్ణమూర్తి, చైర్మన్, డైరెక్టర్ డా.భాస్కర్ పటేల్ విచ్చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్, ప్రిన్సిపాల్ డా. భాస్కర్ పటేల్ మాట్లాడుతూ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు వివిధ విభాగాల్లో బోధన, పరిశోధన నాణ్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ ఆరు రోజుల కార్యక్రమం ఏఐసిటిఈ, ఏటిఏఎల్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతోందని, ఇది ఉపాధ్యాయులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో తాజా పరిజ్ఞానం, ప్రాక్టికల్ నైపుణ్యాలను అందజేయడమే లక్ష్యమని వివరించారు. ట్రస్టీ సభ్యులు శ్రీ వరుణ్ సాయి, సాహితి, విభాగాధిపతులు పాల్గొన్నారు.

## యువకులపై కేసు నమోదు

నారాయణవనం, అక్టోబర్ 27 ప్రభాతవార్త : మండలంలోని వెంకటకృష్ణాపాలెం పంచాయతీ నాగిలేరు సమీపం సింగిరికోనలో ప్రసిద్ది చెందిన శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ నరసింహస్వామి ఆలయ జలపాతం వద్ద ఆదివారం నారాయణ వనం మేజర్ పంచాయతీ గాండ్ల వీధికి చెందిన నీరజ అనే యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి 12మందిపై స్థానిక పోలీసులు సోమవారం మధ్యాహ్నం కేసు నమోదు చేసినట్టు తెలిపారు. సింగిరికోన జలపాతంలో స్నానం చేసే క్రమంలో నీరజ అనే యవతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన సూర్య, నటరాజ్, పి బాలాజీ, మదన్, విక్కీ, వెట్రీ, దీనా, సర్థార్, ముఘనాథం, యువరాజ్, పృధ్వీరాజ్, నవీన్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. తాగిన మద్యంమత్తులో యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం జరిగినట్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

## జంగాలపల్లి చెరువును పరిశీలించిన కలెక్టర్

శ్రీకాళహస్తిరూరల్, అక్టోబర్ 27 ప్రభాతవార్త: ఏర్పేడు మండలంలోని జంగాల పల్లి చెరువును ఆదివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ తన అధికారులతో కలసి పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలతో జంగాల పల్లిలోని చెరువు రివిట్‌మెంట్ వద్ద దెబ్బతిన్నది. ఈ చెరువు నీరు వృధా పోయింది. ఈ చెరువును శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి పరిశీలించారు. వెంటనే పనులు చేయించి నీటిని కాపాడాలని కోరారు. ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు.



ఈ నేపథ్యంలో ఆదివారం కలెక్టర్ వెంకటే శ్వరన్, శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భాను ప్రకాష్ రెడ్డి, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశిలతో కలసి పరిశీలించారు. ఈ చెరువకు సంబంధించిన వివరాలను మండల సీనియర్ నాయకుడు పొన్నారావు వివరించారు.

## పోలసామిని పరామర్శించిన బియ్యపు



శ్రీకాళహస్తి, అక్టోబర్ 27 ప్రభాతవార్త: రిటైర్డ్ ఉపాధ్యాయుడు పోలసామి స్వర్ణమూర్తిని సోమవారం మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి తన సహచరులతో పరామర్శిం చారు. ఇటీవల స్వర్ణమూర్తి కంటి చికిత్స జరుపుకొని ఇంటి వద్ద వున్న, ఆయన్ను పరామర్శించారు. ఆయనతో పాటు మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పగడాల రాజు, కంఠా ఉదయ్‌కుమార్, ఎస్‌విఆర్ ప్రభాకర్, రామచంద్రారెడ్డి, మున్నారాయల్, శ్రీవారి సురేష్, పఠాన్ ఫరీద్‌ఖాన్, మొగరాల గణేష్, చంద్ర, జై చంద్రారెడ్డి, జీవికె రెడ్డి తదితరులున్నారు.

## ఇసుకతాగేలి చెరువును పరిశీలించిన అధికారులు

శ్రీకాళహస్తి రూరల్, అక్టోబర్ 27 ప్రభాతవార్త: ఏర్పేడు మండలంలోని ఇసుక తాగేలి ఇరిగేషన్ చెరువు పరిస్థితిని అధికారులు, నాయకులు కలసి పరిశీలించారు. ఎడతెరపి లేని వాన కురుస్తున్నందువల్ల చెరువులు నిండుతున్నాయి. మళ్ళీ మంథా తుఫాను భయపెడుతున్న సందర్భంగా ముందుజాగ్రత్తగా పరిశీలించారు. ఇసుక తాగేలి గ్రామానికి వెళ్ళినపుడు అక్కడి ప్రజలు మురికి నీటి సమస్యను గురించి ఫిర్యాదు చేసారు. పరిశీలనల్లో తహశీల్దార్ భార్గవి, సిఐ శ్రీకాంత్‌రెడ్డి, ఇరిగేషన్ ఎఇఇ జయకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు బిసి సెల్ ఉపాధ్యక్షుడు రాచేటిసుబ్రమణ్యం, హంస, సర్పంచ్ గుణ యాదవ్, యూనిట్ కేశనేని సుబ్రమణ్యం, మాజీ సర్పంచ్ వై.మనోహర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రామ రామ రామలింగాపురం గిరిజన కాలనీ



తొట్టంబేడు, అక్టోబర్ 27 ప్రభాతవార్త: రామ రామా! రామలింగాపురం గిరిజన కాలనీ. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏళ్ళు గడుస్తున్నా ఇంకా గిరిజన, దళిత కాలనీల్లో సమస్యలు సమస్యలుగానే మిగిలి ఉన్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం తొట్టంబేడు మండలంలోని రామలింగాపురం గిరిజన కాలనీలో జనసేన నాయకులు పర్యటించారు. వారికి గిరిజనులు విన్నవించిన సమస్యలు విన్న వారు వెంటనే స్పందించారు. ఈ నేపథ్యంలో తమ కాలనీకి రావాలంటే వాగులు వంకలు దాటాల్సి వస్తుందన్నారు. వర్షాకాలం మేము ఎక్కడున్నామో తెలియని స్థితి చోటు చేసుకుందన్నారు. ఎన్నో ప్రభుత్వాలు మారాయి, ఎందరో నాయకులు మారారు. తప్ప కనీస సదుపాయాలు కల్పించలేదన్నారు. జనసేన నాయకులు గ్రామాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకొని ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు నివేదికలు పంపుతున్నారు. ఈ పర్యటనలో పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, తేజ, మణి, ప్రదీప్‌కుమార్, నవీన్, చందు, మునిచంద్ర, గోపి, కన్నలి చందు తదితరులు పాల్గొన్నారు.

## బోర్డు సభ్యుని సత్కరించిన ముస్లింలు



తొట్టంబేడు, అక్టోబర్ 27 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీ శ్వరాలయ ధర్మకర్తల మండలి సభ్యుడుగా నియమించిన ఎంఎం వాడకు చెందిన గాదిపాకుల గోపినాథ్‌ను సోమవారం ఆ వార్డు మైనారిటి ముస్లింలు ఘనంగా సత్కరించారు. తెలుగుదేశం పార్టీలో నిజమైన కార్యకర్తలకు ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి పాలనలో గుర్తింపు ఉంటుందని అభిప్రాయపడ్డారు. పార్టీలో సేవలందించే వారికి పదవులతో సత్కరిస్తారనటానికి గాదిపాకులకు అత్యున్నతమైన శ్రీకాళహస్తీశ్వ రాలయ ధర్మకర్తల మండలిలో అవకాశం కల్పించటమే అన్నారు. ఈ కార్యక్రమాల్లో మైనారిటి ముస్లిం నాయకులు షాకీర్ అలి, ఖాదర్‌భాషా, షఫీ, ఖలీల్, ఫ్రూట్ మీర్జా, షేక్ జహీర్‌అహ్మద్, సిఎస్ మస్తాన్, మీర్జా, రఫీ, ఌఖాదర్‌వలి, సాజిద్, నయిం, జావిద్, రాజా, ఇర్ఫాన్, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

## కైలాసకోనలో స్నానానికి నిషేదం

నారాయణవనం, అక్టోబర్ 27 ప్రభాతవార్త : ముంథా తుఫాన్ నేపథ్యంలో మండలంలోని అరణ్యకండ్రిగ పంచాయతీ కైలాసనాథకోనలో ప్రసిద్ది చెందిన కామాక్షాంబిగా సమేత కైలాసనాధుని దర్శనంతో పాటు జలపాతంలో స్నానం చేయడాన్ని పాలకమండలి సభ్యులతో పోలీసులు, రెవెన్యూ అధికారులు నిషేదించారు. జలపాతంలో ఉధృతి తగ్గే వరకు ఎవ్వరికి అనుమతి లేదని నోటీసులు అంటించడంతో పాటు పోలీసులు, సిబ్బంది బందోబస్తు చేపట్టారు.

## శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో స్కంధ షష్టి ఉత్సవాలు



పుత్తూరు రూరల్, అక్టోబరు 27 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి స్కంధ షష్టి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయంలోని మూల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, పంచామృతాభిషేకాలు చేశారు. అలాగే ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం స్వామివారిని విద్యుత్ దీపాలంకరణ ప్రత్యేక పుష్పాలతో అలంకరించి మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

## తాగునీటిపై జాగ్రత్త వహించండి



సత్యవేడు, అక్టోబరు 27 ప్రభాతవార్త: మొంతా తుఫాను నేపథ్యంలో ప్రతి పంచాయతీలో తాగునీరు క్లోరినేషన్‌తో పాటు ఎప్పటికప్పుడు టెస్టింగ్ కూడా చేయించాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, తుఫాను మండల ప్రత్యేకాధికారి విజయ్ భరత్‌రెడ్డి కోరారు. తుఫాను ప్రభావాన్నిసమిష్టిగా ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సి న ముందస్తు జాగ్రత్తలపై సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. విజయ భరత్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న రెండు రోజుల్లో తుఫాను ప్రభావం అధికమవుతుందని వాతావరణ శాఖ హెచ్చరించిన విషయాన్ని గుర్తు చేశారు. అందు వల్ల పంచాయతీ సెక్రటరీలు మండల కేంద్రాల్లో అందు బాటులో ఉండాలన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకర పరిస్థితిలో ఉన్నట్లయితే సమాచారాన్నిసంబంధిత విద్యుత్‌శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో ఎస్ఐ రామస్వామి, తహసీల్దార్ రాజశేఖర్, మండల పరిషత్ పరిపాలన అధికారి త్రివిక్రమరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ కేంద్రాలను పరిశీలించిన త్రివిక్రమరావు

సత్యవేడు, అక్టోబరు 27 ప్రభాతవార్త: సత్యవేడు పట్టణం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మదనంబేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక ఆధార్ కేంద్రాలను స్థానికమండల పరిషత్ పరిపాలన అధికారి త్రివిక్రమరావు పరిశీలించారు. జిల్లా అధికార ఆదేశాల ప్రకారం ప్రత్యేక ఆధార్ క్యాంపులను మండల పరిషత్ అధికారులు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పట్టణంలోనే ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలప్రాంగణంలో చెరివి డిజిటల్ అసిస్టెంట్ విజయశంకర్, మదనంబేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో రాజగోపాలపురం డిజిటల్ అసిస్టెంట్ చంద్రశేఖర్ ఆధార్ కేంద్రాలను నిర్వహించడంతో పలువురు ఆధార్ నమోదు చేసుకున్నారు. ప్రధానంగా కొత్త ఆధార్‌కార్డు నమోదు, ఆధార్ చిరునామా పేర్లు తప్పు ఒప్పులు సరి చేయడం వంటివి నమోదు చేయడం జరిగింది. ఆధార్ క్యాంపులను తుఫాను పరిస్థితుల వల్ల ప్రస్తుతం తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వాతావరణ పరిస్థితులు అనుకూలించగానే తిరిగి మళ్లీ ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

## దత్తాత్రేయని సత్కరించిన, జబ్బల శ్రీనివాసులు



తిరుపతి హెల్త్, అక్టోబర్ 27 ప్రభాతవార్త: హైదరాబాద్ నగరంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయని సౌత్ ఇండియా ఓబీసి అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ముఖ్యంగా తన సుదీర్ఘ రాజకీయంలో తన అనుభవం, రాజకీయ మేలుకోలు, అదేవిధంగా రాజకీయంలో ఏ విధంగా ఉండాలని తెలియజేశారు. సౌత్ ఇండియా ఓబీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపి నారు. భవిష్యత్తులో మరింతగా ఉన్నత పదవులు పొందుతారని అభినందనలు తెలిపారు. అదేవిధంగా జాతీయ ఓబిసి బిజెపి అధ్యక్షుడు రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్‌ని కలిసి ఈ నెల 12 జరిగిన ఓబీసీ సెమినార్ విషయాలు, నిర్ణయాలు తీసుకున్నవి వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు జాతీయ బీసీ నాయకుడు గుజ్జ కృష్ణ, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు భూపేష్ సాగర్, విద్యార్థి సంఘం నాయకుడు రామకృష్ణ, బిసి సోదరులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, **KARNAM KAMALANATH** (old Name), R/at D.No.19-10-35, New Indira Nagar, Tirupati Dist., A.P. I have changed my name as **KARANAM KAMALANATHAN** S/o Karnam Velayudam Pillai. Henceforth, I will be known as **KARANAM KAMALANATHAN** (New Name)

## ముంచుకొస్తున్న మొంథా తుఫాన్

దొరవారిసత్రం, అక్టోబర్ 27 ప్రభాతవార్త: మండల పరిధిలోని తీర ప్రాంత ప్రజలను వరద ప్రభావిత ప్రాంతాలను ముందుగా గుర్తించి అక్కడ ప్రజలను ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టామని తహశీల్దార్ శైలు కుమారి పేర్కొన్నారు. మండల పరిధిలో 11 సచివాలయ వ్యవస్థ ఉండగా ప్రతి సచివాలయంలోనూ సచివాలయం ఉద్యోగులు వీఆర్వో సెక్రెటరీ అందుబాటులో ఉంటారని తుఫాను హెచ్చరికలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలన్నారు. ఎవరు చేపల వేటకి వెళ్ళద్దని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులున్నా 9553285452 నెంబర్‌కు ఫోన్ చేసి తెలియపరచాలని మండల తహశీల్దార్ శైలు కుమారి ఒక ప్రకటనలో తెలిపారు.

## నాదెండ్లకు చిత్రపటాన్ని అందజేసిన శంకర్



వెంకటగిరి, అక్టోబర్ 27 ప్రభాతవార్త: పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చిత్రాన్ని గీసి ఆయనకు చిత్రకారుడు శంకర్ అందజేశారు. శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం నూతన ధర్మకర్తల కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం సందర్భంగా రాష్ట్ర పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్య అతిథిగా శ్రీకాళహస్తి దేవస్థానంకు విచ్చేయడం జరిగింది. ఈ సందర్భంగా వెంకటగిరికి చెందిన పెన్సిల్ కళాకారుడు పోలిశెట్టి శంకర్ బాబు ఆయన పెన్సిల్ ఆర్ట్ చిత్రంను బహుకరించారు.

## నడిరోడ్డులో గుంట-పొంచి ఉన్న ప్రమాదం



వెంకటగిరి, అక్టోబర్ 27 ప్రభాతవార్త: వెంకటగిరి-పారవోలు మార్గంలో నెహ్రూ నగర్ వద్ద రోడ్డులో కుంటపడంతో వాహనదాలకు ప్రమాదం పొంచి ఉంది. గత కొన్ని నెలలుగా రోడ్డు కల్వర్టుకు రంధ్రం పడిందని గ్రామస్తులు తెలిపారు. వీరందరూ కొద్దికొద్దిగా పెద్దది గుంటగా మారిందని చెప్పారు. వాహనదారులు ఈ గుంటలో పడితే ప్రమాదం జరుగుతుందని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు చర్య తీసుకుని గుంటను పూడ్చాలని కోరారు.

## ఢిల్లీకి పోను, వెంకటగిరిలోనే ఉంటా : నేదురుమల్లి



వెంకటగిరి, అక్టోబర్ 27 ప్రభాతవార్త: తాను పార్లమెంటుకు పోటీ చేస్తానని కొందరు చేస్తున్న ప్రచారం అవాస్తవమని, వెంకటగిరి నుండి పోటీ చేస్తానని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. వెంకటగిరి పట్టణంలోని 8, 14, 24 వార్డులలో మెడికల్ కళాశాలలను ప్రైవేటు చేయరాదని కోటి సంతకాల పోరు కార్యక్రమంలో భాగంగా సంతకాల స్వీకారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తనకు ప్రమోషన్ వద్దని వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గం చాలని తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గ ప్రజలకు సేవ చేయమని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనను పంపారని తెలిపారు. నెల్లూరు పార్లమెంటుకు పోటీ చేస్తానని వస్తున్న ప్రచారం అవాస్తమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన 17 మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రవేట్‌పరం చేయాలని ఆలోచన మంచిది కాదన్నారు. చైర్పర్సన్ నక్క భానుప్రియ, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ నక్క వెంకటేశ్వర రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య, టెలికం సలహా మండలి సభ్యులు హరికృష్ణ, కౌన్సిలర్లు కళ్యాణి, శంకరయ్య, పూజారి లక్ష్మి, శ్రీనివాసులు, ఎంపి నారాయణ, నాయకులు మురళీకృష్ణ, సతీష్, దశరథ రామ్‌రెడ్డి, సిపిఎం నరసింహారావు, రాజారెడ్డి, నారి సురేష్‌లు పాల్గొన్నారు.

## తుపాను పట్ల అప్రమత్తంగా ఉండాలి : తహశీల్దార్



కోట, అక్టోబర్ 27 ప్రభాతవార్త: మొంథా తుపాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ కె.జయజయ రావు కోరారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో కేటాయించిన ప్రాంతాల్లో అధికారులు ఉండాలని సూచించారు. మండలంలో ఎక్కడా కూడా ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. తీరం వెంబడి మత్స్యకారులు వేటకు వెళ్ల వద్దని కోరారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ దిలీప్‌కుమార్, ఎస్ఐ పవన్‌కుమార్, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## భూమిని దౌర్జన్యంగా ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారు

**- రాజ వంశస్థులు వెలుగోటి రాజేంద్రకుమార యాచేంద్ర**



వెంకటగిరి, అక్టోబర్ 27 ప్రభాతవార్త: మండలంలోని సెంట్లు భూమి మాకు ఉందని ఈ భూమిని కొందరు ఆక్రమించే ప్రయత్నాలు చేస్తున్నారని రాజవంశస్తులు మడిచాను కండ్రిగ రెవెన్యూ పరిధిలో ఉన్న 10 ఎకరాల భూమి 96 సెంట్లు భూమి మాకు ఉందని ఈ భూమిని కొందరు ఆక్రమించే ప్రయత్నాలు చేస్తున్నారని రాజవంశస్తులు వెలుగోటి రాజేంద్ర కుమార యాచేంద్ర తెలిపారు. ఈ భూమిని వెంకట్ రత్నం రాజు, చంద్రశేఖర్ రాజు మరి కొందరు దౌర్జన్యంగా మరి కొందరుదున్ని ఆక్రమించే ప్రయత్నం చేశారని పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయితే వీరు మరల దౌర్జన్యం చేస్తున్నారని తెలిపారు. సర్వే నంబర్ సర్వే నంబర్ 124, 125,126 పది ఎకరాల 96 సెంట్లు భూమి ఉందని తెలిపారు. వీరు తప్పుడు పత్రాలు సృష్టించి తమవని చెబుతున్నట్లు తెలిపారు. పట్టాదారు పాస్ బుక్స్ 1 బి అన్ని రికార్డులు తమ బి అన్ని రికార్డులు తమ అవ పేరుతో ఉన్నట్లు తెలిపారు. తాము పూర్వం ఎన్నో ఆస్తులు దానం చేశామని తెలిపారు. అయితే ఈ భూమిని జికెపల్లి గ్రామానికి చెందిన బాబు నాయుడుకి సాగు చేసుకునేందుకు లీజుకు ఇచ్చినట్లు తెలిపారు. తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

## తుఫాన్ పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలి : ఎస్సై



బాలాయపల్లి, అక్టోబర్ 27 ప్రభాతవార్త: మొంథా తుఫాన్ ప్రభావం ఈనెల 28 వరకు మండలంలో భారీ వర్షాలు కురుస్తాయి. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కామినేని గోపి తెలిపారు. భారీ వర్షాలు, బలమైన గాలులు వచ్చే అవకాశమున్నందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు తప్ప, ఎట్టి పరిస్థితుల్లోనూ వర్షంలో బయటకు వెళ్లవద్దని తెలిపారు. నీరు చేరిన ప్రాంతాలు, వాగులు, వంకలు, చెరువులు వంటి ప్రదేశాల దగ్గరికి వెళ్లకుండా ముందస్తుగా రెవిన్యూ సిబ్బంది కంచెలు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ విజయలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. విద్యుత్ వైర్లు తెగిపడినా, చెట్లు కూలినా, నీరు ఇళ్లలోకి చేరినా వెంటనే సమాచారం ఇస్తే, సహాయక చర్యల కోసం సిబ్బంది, జేసీబీలు, నీటి ట్యాంకర్లు సిద్ధంగా ఉంచినట్లు వివరించారు.

## వైద్య సేవలను పరిశీలించిన అధికారులు

వాకాడు, అక్టోబర్ 27 ప్రభాతవార్త: తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు తూపిలి పాలెం గ్రామంలోని సోమవారం వైద్య శిబిరాన్ని తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్, ఎంపీడీవో సాయిప్రసాద్ అకస్మికంగా తనిఖీ చేసి, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వైద్యులకు, సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్యులకు సహకరించాలని స్థానికులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం తూపిలిపాలెం గ్రామానికి అత్యంత సమీపంలో ఉన్న బంగాళాఖాత సముద్రాన్ని తహశీల్దార్, ఎంపీడీవో పరిశీలించారు. సముద్రంలో చేపల వేట నిషేధం, మత్స్యకారులు ఎవరిని సముద్రం లోకి వేటకు వెళ్లకుండా చూడాలని మెరైన్ పోలీసులకు వారు సూచించారు. తీర ప్రాంత గ్రామాలలో నివసిస్తున్న ప్రజలు కు ఎప్పటికప్పుడు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. వారి వెంట రెవెన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్, వీఆర్ఓ శ్రీనివాసులు, పలువరు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## తుఫానుపై అప్రమత్తంగా ఉండాలి



దక్కిలి, అక్టోబరు 27 ప్రభాతవార్త: మొంథాన్ తుఫాన్‌పై అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మోపూరు శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని దక్కిలి పంచాయతీ వెలుగొండ కొండ కింద ఉన్న అత్తలసిద్దవరం గిరిజన కాలనీకి వెళ్లే రోడ్డును పరిశీలించారు. తుఫాన్ ప్రభావంతో వర్షం, గాలి ఎక్కువగా ఉండడం వల్ల కాలనీ వాసులను బయట ప్రాంతాలకు వెళ్లకుండా ఉండేలా గిరిజనులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట ఎంపీడీఓ రవీంద్రబాబు ,ఎస్సై శివశంకర్, సిబ్బంది ఉన్నారు.

# గూడూరు డివిజన్

## ముంచుకొస్తున్న మొంథా తుఫాన్

పెళ్లకూరు అక్టోబర్ 27 ప్రభాతవార్త : ఉపద్రవంలా ముంచుకొస్తున్న మొంథాతుఫాన్ వల్ల కలిగే నష్టాన్ని నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందు నుంచి అధికారులను ప్రజలను అప్రమత్తం చేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి పెళ్లకూరు మండలంలో కంట్రోల్ రూము ను ఏర్పాటు చేయడం జరిగింది కంట్రోల్ రూమ్ నెంబర్ 6304208903 ఈ తుపాను వలన ప్రజలకు అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు ఈ నెంబరు కు ఫోన్ చేసినట్లయితే వెంటనే సహాయక చేపట్టడానికి వీలవుతుందని అధికారులు తెలిపారు.

## సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలి

కోట, అక్టోబర్ 27 ప్రభాతవార్త: మొంథా తుపాను నేపథ్యంలో స్వర్ణముఖి నది కింద ఉన్న దెయ్యాలదిబ్బ, చీకళ్లదిబ్బ, దొరువుకట్ట గ్రామాల్లోని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి రావాలని తహశీల్దార్ కె.జయజయరావు పిలుపునిచ్చారు. సోమవారం ఆటో ద్వారా ఆయా గ్రామాల్లో ప్రచారం చేయించారు. స్వర్ణముఖి నది కింద ఉన్న దెయ్యాలదిబ్బ గ్రామస్థులు సురక్షితమైన ప్రాంతాలకు తరలి రావాలని కోరారు. ఎంపిడిఓ దిలీప్‌కుమార్, ఎస్ఐ పవన్‌కుమార్, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

## కామ్రేడ్ కాలేషా మృతి తీరని లోటు

**- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి**



గూడూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త: సిపిఐ పట్టణ కార్యదర్శి కాలేషా మృతి తీరని లోటు అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళిలు పేర్కొన్నారు. సోమవారం గూడూరు రెండో పట్టణంలోని కాలేషా పార్థివదేహాన్ని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్ర శేఖర్ రెడ్డి, రాధాకృష్ణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, సీపీఐ వెంకటగిరి నియోజకవర్గ కార్యదర్శి బాలకృష్ణలు సందర్శించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఐ గూడూరు పట్టణ కార్యదర్శి కాలేషా మృతి కలిచివేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశి కుమార్, సీపీఐ చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్, ఏఐటియుసి నియోజవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సి.వి.ఆర్ కుమార్, నారాయణ, ఇన్సాఫ్ నాయకులు జమాల్, బికెఎంయు నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసా మూర్తి, ఏఐవైఎఫ్ నాయకులు సి.హెచ్ వెంకటేశ్వర్లు, సునీల్, మీరా భాయ్, వెంకటయ్య, నాగేంద్ర, మునేంద్ర, రఘు రామయ్య, కన్నా సుబ్రహ్మణ్యంలు పాల్గొని నివాళులు అర్పించారు.

## తుపాను పట్ల అప్రమత్తంగా ఉండండి



సూళ్లూరుపేట, అక్టోబర్ 27 ప్రభాతవార్త: మండల పరిధిలో తుపాను పట్ల అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన వివిధ శాఖల అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూళ్లూరుపేట మండల పరిధిలో అవసరమైన చోట్ల పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి ఉన్నామన్నారు. తీరప్రాంత గ్రామాలైన కొరిడి, దామరాయి, కడపట్ర పంచాయతీలకు సంబంధించి రాగన్నపట్టెడలోని హైస్కూల్లో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని లోతట్టు ప్రాంతాలైన వట్రపాలెం, గమండ్లవీధి, నాగరాజపురం, తదితర ప్రాంతాలకు సంబంధించి పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి ఉన్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఆర్డీఓ కిరణ్మయి ఆదేశాలను పాటిస్తూ అన్ని శాఖల అధికారుల సమన్వయంతో తుపాను గండాన్ని ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉందన్నారు. ఎప్పటికప్పుడు కాళంగినది, పాములకాలువ ప్రవాహాలను పరిశీలిస్తున్నట్లు తహశీల్దార్ గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అత్యంత దుర్మార్గం



పెళ్లకూరు అక్టోబర్ 27 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడంపై పెళ్లకూరు మండలంలో చెంబెడు, అర్ధమాల, పునబాక గ్రామాలలో వైఎస్సార్సీపీ మండల అధ్యక్షులు ఒబ్బు వెంకటరత్నం ఆధ్వర్యంలో సోమవారం నాడు రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటికి తిరుగుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరిస్తూ వారి నుంచి సంతకాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీ లను ప్రైవేటీకరణ చేయడం అత్యంత దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శేఖర్‌రెడ్డి వైస్ ఎంపీపీ వెంకటరాఘవరెడ్డి జడ్పిటిసి నన్నం ప్రిస్కిల్లా రాష్ట్ర బీసీ సెల్ సెక్రెటరీ ఎల్లు మోహన్, వాలంటీర్ వింగ్ శ్రీపురం మునిరాజా, యువజన విభాగ అధ్యక్షులు సాగి జితేంద్ర, ఎస్సీ సెల్ అధ్యక్షులు మల్లాం సురేష్, బీసీ సెల్ అధ్యక్షులు గంజి దయ మరియు వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజల నుండి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే



గూడూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా విజ్ఞప్తుల దినోత్సవంలో భాగంగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపే ప్రొపోజల్స్ ప్రభుత్వంకి పంపాలని జిల్లా కలెక్టర్‌కి ఆదేశాలు అందాయని, ఆ ప్రపోజల్స్‌ను జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వానికి కూడా పంపారని, వీలైనంత త్వరగా గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతారని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం తుపాన్ పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెలబల్లి భాస్కర్ రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర రాజు, శీలంకిరణ్‌కుమార్, బిల్లుచెంచురామయ్య, శ్రావణి రెడ్డి, అమరేంద్రలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు కమిటీ సభ్యులు



గూడూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త: పట్టణం రాజా వీధి నందు ఉన్న శ్రీశ్రీశ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం నూతనంగా ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు సోమవారం గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే దేవస్థానం నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కంటి రామ్మోహన్ రావు, పేపళ్ల అమరయ్య నాయుడు, మంగళపూర్ గోపాల్, పర్వతాల నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## ఆదిశంకర యూనివర్సిటీకి విచ్చేసిన రిలయన్స్ గ్రూప్

గూడూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త: రిలయన్స్ గ్రూప్ అన్మోల్ అంబానీ, క్రిష షా అంబానీ మరియు మిషల్ పాలు గూడూరు పట్టణంలోని ఆదిశంకర యూనివర్సిటీ ప్రతినిధులతో విద్యలో నూతన విధానాలు, పోకడలు గురించి కులంకుషంగా చర్చించి అనిమేషన్ ఇతర క్రొత్త కోర్సుల ఒప్పందం చేసుకోవాలని ఆలోచిస్తున్నట్లు యూనివర్సిటీ ఫౌండర్ డాక్టర్ వంకి పెంచలయ్య అంబానీలు ఒక సంయుక్త ప్రకటనలో తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఛాన్సలర్ వంకి అరవింద, వైస్ ఛాన్సలర్ రిజిస్ట్రార్, డెప్యూటీ రిజిస్ట్రార్, వివిధ విభాగధిపతులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో వ్యక్తిపై దాడి!

చిల్లకూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త: మండల పరిధిలోని వరగలి క్రాస్ రోడ్ వద్ద నుండి తమ్మిన పట్నం సౌత్ గేట్ వరకు సాగరమాల రహదారు నిర్మాణం చేపడుతున్ ఓ సంస్థలో పనిచేస్తున్న ఒరిస్సా రాష్ట్రానికి చెందిన కూలీలు ఆదివారం సాయంత్రం నర్సింగ్, ఓ రామ్, సమీర్ నాయక్ సెలవు కావడంతో ఇద్దరు మద్యం సేవించిన గొడవపడ్డారు. ఈ గొడవలో సమీర్ నాయక్ అనే యువకుడు నర్సింగ్ హోరామ్ (28) అనే యువకుడిని రాడ్‌తో బలంగా కొనడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చిల్లకూరు ఎస్ఐ సురేష్ బాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతికి గల కారణాలు అడిగి తెలుసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

## మోంథా తుఫాన్ ఎదుర్కొనేందుకు ముందస్తు జాగ్రత్త చర్యలు



చిల్లకూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త: అధికారులు సమన్వయంతో గ్రామాల్లో ప్రజలకి అందుబాటులో ఉండాలని మెంతు తుఫాన్ స్పెషల్ ఆఫీసర్ అరుణ్ బాబు అన్నారు. సోమవారం చిల్లకూరు మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి అనంతరం మాట్లాడుతూ రానున్న తుఫాను దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ముందస్తు చర్యలు అధికారులు చేపట్టాలని అవసరమైన లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను పునరావస కేంద్రాల తరలించాలన్నారు. అదేవిధంగా తహశీల్దార్‌శ్రీనివాసులు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘం అధ్యక్షులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ మీ గ్రామాల పరిధిలో ఉన్న చెరువులుకి సంబంధించి చెరువు కట్టలు దెబ్బతిని ఉంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు. ఆయన వెంట చిల్లకూరు ఎస్ఐ సురేష్ బాబు, ఎంపిడిఓ గోపి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వరిపంటను పరిశీలించిన అధికారులు

తవణంపల్లె, అక్టోబర్ 27 ప్రభాతవార్త: మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెబ్బతిన్న వరిపంటను వ్యవసాయాధికారులు పరిశీలించారు. ఈమేరకు జిల్లా ఏరువాక కేంద్రం, చిత్తూరు కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.రామారావు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ, తిరుపతి శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్‌వి.సరళ, డాక్టర్ బి.వసంత, డాక్టర్ నాగమణి, డాక్టర్ హారతి, మండల వ్యవసాయాధికారి జి.ప్రవీణ్‌లు కలసి మండలంలోని నల్లిశెట్టిపల్లె, ఉత్తర బ్రాహ్మణపల్లె, పుణ్యసముద్రం గ్రామాలలో పర్యటించి అధిక వర్షాలకు దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఈమూడు గ్రామాల్లో ఏడు ఎకరాల మేర అధికి వర్షాలకు వరిపంట దెబ్బతిన్నట్లు గుర్తించారు. వరిపంట వర్షాలకు నేటమట్టం కావడంతో వరి కంకులు నీట మునిగి మొలకెత్తినట్టు గుర్తించారు.

## ధోనిని కలసిన బొజ్జల



శ్రీకాళహస్తి, అక్టోబర్ 27 ప్రభాతవార్త: క్రికెట్ స్టార్ మహేంద్ర సింగ్ ధోనిని శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి న్యూఢిల్లీలోని ఆయన నివాసంలో కలసి స్వామి అమ్మవార్ల ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజల గురించి వివరించారు. ఈ పూజలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందని ఒక సారి రావాలని ఆహ్వానించారు.

## పరశురామేశ్వరునికి బిల్వార్చన శ్రీకారం



శ్రీకాళహస్తిరూరల్, అక్టోబర్ 27 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన అనందవల్లి సమేత పరశురామేశ్వరుని సన్నిధిలో కొత్త సేవలకు శ్రీకారం చుట్టినట్లు మాజీ చైర్మెన్ బత్తల గిరినాయుడు సోమవారం తెలిపారు. ఈ ఏడాది నుంచి కార్తీక మాసంలో స్వామి వారికి ఇష్టమైన బిల్వాలతో పూజలు చేసే సేవలను ప్రవేశ పెట్టినట్లు వివరించారు. ఈ సేవలో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు బిల్వ దళాలను తీసుకొచ్చి సమర్పించారు. సేవలో పాల్గొన్నారు. విల్వార్చనకు విశేష స్పందన వచ్చిందని తెలిపారు. ఈ అర్చనలో పాల్గొన్న భక్తులకు స్వామివారిపై ఉత్తరిని(కండువా)స్వామి వారి లడ్డువడ, విబూది ప్రసాదాన్ని ప్రత్యేకంగా తయారు చేసిన బ్యాగులను అందించారు. ఈ కార్యక్రమాలను మాజీ చైర్మెన్ బత్తల గిరి నాయుడు సారథ్యంలో ఇఓ రామచంద్రారెడ్డి పర్యవేక్షించారు.

## ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు-19 దుంగలు స్వాధీనం



నారాయణవనం, అక్టోబర్ 27 ప్రభాతవార్త : తిరుపతి ఇల్లా పుత్తూరు అటవీశాఖ పరిధిలోని నారాయణవనం మండలం వద్ద 19 ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకొని ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేసినట్టు తిరుపతి టాస్క్‌పోర్సు అధికారులు తెలిపారు. వీరి కథనం మేరకు వివరాలు ఇలా వున్నాయి. జిల్లా ఎస్పీ సుబ్బ రాయుడు, టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఆదివారం కైలాసకోన నుంచి కూబింగ్ నిర్వహించడం జరిగిందన్నారు. కూబింగ్ సమయంలో నారాయణవనం మండలం సింగిరికోన వద్ద కనికలమ్మ ఆలయం సమీపం వద్దకు చేరుకోవడంతో అక్కడ ఇద్దరు వ్యక్తులు అనుమానస్పందంగా తిరుగుతూ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. వెంబడించి వారిని పట్టుకొని విచారించగా చుట్టుపక్క ప్రాంతాల్లో 19 ఎర్రచందనం దుంగలను గుర్తించినట్టు చెప్పారు. పట్టుబడిన వారిలో పుత్తూరు మండలం వీరప్పరెడ్డిపాలెం ఆది ఆంధ్రవాడకు చెందిన మురళి, ప్రశాంత్‌లుగా గుర్తించారు. ఎంతో చాకచక్యంగా కేసును చేదించిన డిఎస్పీలు ఎండీ షరీఫ్, శ్రీనివాసులురెడ్డి, ఆర్ఐ గిరిధక్, ఎఆర్ ఎస్ఐ ఈశ్వర్‌రెడ్డి, ఎసిఎఫ్ శ్రీనివాస్‌లను అభినందించారు.

## సంస్కృత వర్సిటీలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ -2025



తిరుపతి విద్య, 27 అక్టోబర్ ప్రభాతవార్త: నేషనల్ సంస్కృత వర్సిటీలో అక్టోబర్ 27 నుండి నవంబర్ 2, 2025 వరకు విజిలెన్స్ మన భాగస్వామ్య బాధ్యత అనే కేంద్ర ఇతివృత్తంతో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ 2025ను పాటిస్తోంది. విశ్వవిద్యాలయ సమాజంలోని అన్ని వర్గాలలో సమగ్రత, పారదర్శకత, జవాబుదారీ తనం, నైతిక బాధ్యత విలువలను ప్రోత్సహించడం ఈ ఆచారం లక్ష్యం. విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సంస్కృత వర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డ్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎం.వి. ఎస్.స్వామి, ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా హాజరయ్యారు. వర్సిటీ రిజిస్ట్రార్ కె.వి.వెంకట నారాయణరావు ప్రత్యేక అతిథిగా పాల్గొని తన విలువైన మార్గదర్శకత్వాన్ని అందించారు. ఈ సందర్భంగా వైస్‌ఛాన్సలర్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి అప్రమత్తంగా ఉండి జీవితంలోని అన్ని అంశాలలో పారదర్శకతను కాపాడుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఎం. వి.ఎస్.స్వామి, ప్రతి రంగంలోనూ సమగ్రతను ప్రోత్సహించడంలో మరియు అవినీతిని నిరోధించడంలో ప్రజల భాగస్వామ్యం యొక్క ప్రాముఖ్యతను ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీని అన్ని బోధనా అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పిహెచ్‌డి పండితులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## మొంథాస్‌తో అప్రమత్తంగా ఉండండి : జిల్లా ఎస్పీ



తిరుపతి, అక్టోబర్ 27ప్రభాతవార్త: మొంథా తుఫాన్ ప్రభావంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇంటికి పరిమితంకావాలని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు విజ్ఞప్తి చేశారు. ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. తిరుపతి జిల్లాపై తుఫాన్ ప్రభావంఉండే అవకాశం ఉండటంతో ప్రజల భద్రతకు, రక్షణకు పోలీసు యంత్రాంగం సిద్దంగా ఉందన్నారు. ఏదేని అత్యవసర సమయాల్లో సహాయానికి 112కు సమాచారం అందించాలన్నారు. తుఫాన్‌పై తప్పుడు ప్రచారాలు చేసినా, వదంతులు వ్యాపింప జేసినా చర్యలు తీసుకుంటామన్నారు.

## నిధులు విడుదల చేసి బలిజభవన నిర్మాణం పూర్తి చేయాలి

**-ముద్రనారాయణ రూ.10లక్షలు ప్రకటన**



తిరుపతి, అక్టోబర్ 27ప్రభాతవార్త: తిరుపతిలో బలిజల అభ్యున్నతికి అవసరమైన మేరకు గత తెలుగుదేశం ప్రభుత్వంలో 2017లో మంజూరై, నిర్మాణంలో ఉన్న బలిజభవన్‌ను పూర్తిచేయాలని బలిజ భవన్ అభివృద్ధి సొసైటీ కోరింది. గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వంలో ఈ భవనం నిధులులేక నిర్మాణం ఆగిపోయింద న్నారు. ఇప్పుడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, సిఎం చంద్రబాబునాయుడుకు విజ్ఞప్తి మేరకు 3.40కోట్ల రూపాయలు నిదులు విడుదలకు అంగీకరించారన్నారు. బిసి కార్పొరేషన్ ఈ నిధులను త్వరగా విడుదల చేసి భవన నిర్మాణాన్ని పూర్తిచేయడానికి సహకరించాలని బలిజ భవన్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, గుత్తా నాగరాజరాయల్, జెడబ్ల్యు విజయ కుమార్, బుల్లెట్‌రమణ, ముద్ర నారాయణ, చిన్నారాయల్, బండ్ల లక్ష్మీపతి రాయల్, జయకృష్ణ, చక్రపాణి, రెడ్డిశేఖరరాయలు, తుపాకుల మురళి, దుద్దేల బాబు, ఆముదాల తులసీరామ్, అరుణ, ముక్కు సత్య వంతుడు, సంతోష్ రాయల్, కొణిదల మురళి తదితరులు పాల్గొని అనేక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా బలిజభవన్ నిర్మాణానికి డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ 10లక్షల రూపాయలు ఆర్థిక సాయం ప్రకటించారు.

## కార్తీక సోమవారాలు .. శివనామస్మరణలు



చంద్రగిరి, అక్టోబర్ 27 ప్రభాతవార్త: కార్తీక మాసం విశేష సోమవారాలలో మొదటి సోమవారం శైవక్షేత్రాలు భక్తుల శివనామస్మరణలతో పోటెత్తాయి. ఇందులో భాగంగా చంద్రగిరిలోని శ్రీశ్యామలాంబ సమేత మల్లేశ్వర ఆలయం (పుట్టాలమ్మ గుడి)లో ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ శివకుమార్ శర్మ స్వామి వారికి ప్రత్యేక పూజల అనంతరం విశేష అలంకరణలతో స్వామివారిని ముస్తాబు గావించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అదేవిధంగా శేషాపురంలోని టిటిడి అనుబంధ శ్రీశేషాచల లింగేశ్వర ఆలయంలో ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు దర్శన సౌకర్యం కల్పించారు. తొండవాడ స్వర్ణముఖినదీ తీరాన వెలసియున్న శ్రీ అగస్త్యేశ్వర స్వామి వారి ఆలయంలో ఆలయ అర్చకులు అభిషేకాధి, నిత్యకైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

## మత్స్యకారులు సముద్ర వేటకు వెళ్ళవద్దు



శ్రీసిటీ, అక్టోబర్ 27 ప్రభాతవార్త: పులికాట్ సరస్సులోకి మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని ఖిమొంథాఖితుఫాను ప్రభావంతో భారీ నుండి అతి భారీ వర్షాలు వేగంగా గాలిని వీచే అవకాశం ఉందని అధికారులు అప్రమత్తంగా ఉండాలని తిరుపతి జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సందీప్ రఘు వాన్సీ మండల అధికారాలకు సూచించారు సోమవారం సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, తడ తహసిల్దార్ శరత్ బాబు, ఎంపీడీవో శేఖర్ నాయక్ తో కలిసి బీవీ పాలెం పులికాట్ సరస్సు బోట్ యాడ్ పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రజలకు అన్ని సమయాలలో అందుబాటులో ఉండాలని ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని అధికారులను జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సూచించండి

## శివయ్య సేవలో హర్యానా విధాన సభ కమిటి



శ్రీకాళహస్తి, అక్టోబర్ 27 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం హర్యాన విధాన సభ కమిటి సభ్యులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికారు. ఎఇఓ మోహన్, ఎపిఆర్ఓ రవిల సారథ్యంలో వేదపండితులచే స్వాగతం పలికి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం వారికి వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.